సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

అనంతపురం

: fb.com/vaartha Digital

Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 351 పేజీలు: 08+4 వెల: 6.50

ప్రకృతి సాగు చేద్దాం... భూమిని బాగు చేద్దాం: సిఎం 2లో

అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్లు: కేంద్రం

# భారీ పెట్టుబడుల ఒప్పందాలు




బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ అయిన దృశ్యం. చంత్రంలో మంత్రి లోకేష్ ఉన్నారు

### దావోస్‌లో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు భేటీ, కుదిరిన ఒప్పందాలు

### పి-4 విధానం ద్వారా పేదరికాన్ని తగ్గిస్తున్నాం

### రాష్ట్రంలో 10 లక్షల మందికి ఎఐ, క్వాంటం టెక్నాలజీలో శిక్షణ: ముఖ్యమంత్రి

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పని చేయడం తనకు అలవాటు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ముందుచూపుతో వ్యవహరించి వినూత్నంగా ఆలోచించి చిత్తశుద్ధితో, కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యం అని నమ్ముతానని ఉద్ఘాటించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్‌లో మూడో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు ఇష్టాగోష్టిగా సంభాషించారు. ఎపిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది తన ఆలోచన అని సిఎం స్పష్టం చేశారు. ఎపి అమలు చేస్తున్న విధానాలను, >>2



బుధవారం ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న అసెంబ్లీ స్పీకర్ల 86వ అఖిల భారత మహాసభలో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

## చట్టసభలకు రాకపోతే నో వర్క్- నో పే!

### అమలు చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

### ప్రజా ప్రతినిధులను వెనక్కి పిలిచే హక్కు ప్రజలకు కల్పించాలి

### యుపిలో జరుగుతున్న స్పీకర్ల సదస్సులో పాల్గొన్న అయ్యన్న

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభకు సభకు హాజరుకాని వారికి 'నో వర్క్-నో పే' నిబంధన వర్తింపజేయాలని ఎపి శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేసారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే వారి వేతనాల్లో కోత వేసినట్టే, ప్రజాప్రతినిధుల జీత భత్యాల్లో సైతం కోతను విధించాలన్నారు. సక్రమంగా పనులు చేయక పోతే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను వెనక్కు పిలిపించే హక్కు కల్పించాలి. ఈ 'రైట్‌టురీకాల్' హక్కుతో ప్రజలే వారికి సరైన గుణ పాఠం నేర్పగలుగుతారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 2024 జూన్ లో ఎన్నికైనప్పటి నుంచి కొంత మంది శాసనసభ్యులు ఈనాటి వరకు ఒక్కరోజుకూడా సమావేశాలకు హాజరుకాలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగు >>2

## భూముల మార్కెట్ విలువ మళ్లీ పెంపు

### ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భూముల మార్కెట్ విలువలను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. సవరించిన భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ మెమో జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండోసారి భూముల మార్కెట్ విలువల పెంపు కావడం గమనార్హం. గత ఏడాది కొత్త జిల్లాలు, వాణిజ్య ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం 15 శాతం కంటే ఎక్కువగా పెంచింది భూముల మార్కెట్ విలువలు పెరగడం వల్ల ప్రభుత్వానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ద్వారా రూ.13,150 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు ఇది కీలక >>2

బడ్జెట్ సమావేశాల్లో అమరావతికి చట్టబద్ధత! 2లో

యేడాదిన్నర తర్వాత పాదయాత్ర చేస్తా: జగన్ 3లో

## పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనం

### రంగంపేటలో అంబరాన్నంటిన జల్లికట్టు సంబరాలు



బుధవారం ఆరేపల్లి రంగంపేటలో పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనం

**చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త:** పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనంతో ఆరేపల్లి రంగంపేట కిటకిటలాడింది. ఆరేపల్లి రంగంపేటలో కనుమ రోజున జరుపుకునే జల్లికట్టు సంబరాలను అనివార్య కారణలతో వాయిదా వేశారు. ఇందులో భాగంగా బుధవారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఆరేపల్లి రంగంపేటలో జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన చెక్క పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువత పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు రైతులు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఒక చెక్కతో అందంగా మలచబడిన పట్టీని పాడిరైతు తన ఎద్దు కొమ్ములకు కట్టి జనంలోకి వదలిపెడతాడు. తన ఎద్దు కొమ్ములకు కట్టిన పట్టీని గెలుచుకున్న యువత పౌరుషానికి ప్రతీకగా భావిస్తారు. జల్లికట్టు సంబరాలలో తమ పౌరుషాన్ని ధీటుగా ప్రదర్శించేందుకు యువత సైతం రెట్టించిన ఉత్సాహంతో పోటెత్తిన పోట్లగిత్త_లను నిలువరించి పట్టీని సొంతంచేసుకునేందుకే బరితెగించి యుద్ధమే చేశారు. ఈ సాహస కృత్యంలో పలువురు పట్టీలు కొట్టి గాయాలపాలయ్యారు. ఈ జల్లికట్టు సంబరాలను తిలకించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాధి మంది చేరుకోవడంతో ఏ.రంగంపేట జనసంద్రమయ్యింది. జల్లికట్టు సంబరాలకు ప్రత్యేక స్థాన ం కలిగివుండటంతో సంబరాలకు ప్రారంభానికి ముందు చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని సందడి చేశారు. ఎంఎల్ఏ రాకతో పార్టీ నాయకులు, అభిమానులు అపూర్వ స్వాగతం పలుకుతూ హోరెత్తిన కేరింతల నడుమ తమ అభిమాన నాయకుడిని భుజాలకెత్తుకుని మోసుకుంటూ గ్రామవీధులలో ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం జల్లికట్టు సంబరాలను అట్టహాసంగా ప్రారంభించారు.




**Tirupati: Bhargavi Auto**: 9248722999 | **Kurnool: MSA Motors** : 9848794545 | **Kadapa: MSA Motors** : 9848794545 | **Anantapur: Jayalakhsmi Automotives:** 9550642233 | **Nivya Automobiles:** 8977783312.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.

22-1pg2exHMNWJQE.qxd:22-1pg2exHMNWJQE.qxd 22/01/26 11:30 PM Page 1





బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్

# అమరావతిలో ఆర్టిఫిషియల్ వర్సిటీ

## దావోస్ సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ.జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించటంతో పాటు యువతకు నైపుణ్యశిక్షణ, ఉపాధి అవకాశాలను అందిస్తూ ఎఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేలా ఎపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్టు కాలిస్టా రెడ్మండ్ ముఖ్యమంత్రికి తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఆర్టిఫీషియల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్యా చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఎపితో ఒప్పందం చేసుకున్నట్టు ఎన్విడియా ఉపాధ్యక్షురాలు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు హార్డ్ వేర్ తయారీ యూనిట్ ఏర్పాటు, సహా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం వహించే అంశంపై ఎన్విడియా ఆసక్తి కనపరిచింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు హార్డ్ వేర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఎన్‌విడియా ఆసక్తి కనపరిచింది. దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో సిఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో స్టార్టప్ లను ప్రోత్సహించటంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందిస్తూ ఎఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేలా ఎపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్టు కాలిస్టా తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఆర్టిఫీషియల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్టు ఎన్‌విడియా ఉపాధ్యక్షురాలుకాలిస్టా రెడ్మెండ్ వివరించారు.

**సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతి**

అమరావతిని సైబర్ సెక్యూరిటీ నగరంగా తీర్చిదిద్దేందుకు సాంకేతికత సహకారం అందించాలని ఇజ్రాయెల్ ప్రతినిధులను సిఎం చంద్రబాబు కోరారు. దావోస్‌లో సిఎం చంద్రబాబుతో ఇజ్రాయెల్ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్ స్లట్జ్కి సమావేశం అయ్యారు. విశాఖ చెన్నై కారిడార్‌లో యుఎవి డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ సాంకేతికతపై ఇజ్రాయెల్ దేశ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికతపై సహకారం అందించే అంశంపై చర్చ జరిగింది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు సెమీకండక్టర్ల తయారీతో పాటు జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల లాగే ఇజ్రాయెల్ కూడా ఓ పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. కట్టుదిట్టమైన సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించే అంశంపైనా ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగాయి. మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల రూపకల్పనపై చర్చించామని వివరించారు సిఎం చంద్రబాబు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన సహా ఎపిని మెడ్ టెక్, ఏరో డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష ్యం దిశగా అడుగులు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక తయారీకి ఇజ్రాయెల్ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రణాళికలపై సైతం ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించామని చంద్రబాబు తెలిపారు.

# పెట్టుబడుల ఒప్పందాలు

>> వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఎపి గురించి చర్చించుంటోందన్నారు. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత దేశానికి లేదని వ్యాఖ్యానించారు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారతదేశ అదనపు బలమని ధీమా వ్యక్తం చేశారు.

పరిశ్రమలకు వేగంగా అనుమతులివ్వడంతోపాటు, ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఎపి అభివృద్ధిలో గొప్ప ముందడుగు అని గుర్తు చేశారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించామని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నమన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తికి అడుగులు వేసి, పరిశ్రమ నిర్మిస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు వివరించారు. 30 ఏళ్ల క్రితం దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయన్న చంద్రబాబు, ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నామన్నారు. అభివృద్ధిలో అందర్నీ భాగస్వాములను చేసే ఉద్దేశ్యంతోనే వన్ ఫ్యామిలీవన్ ఎంట్రపెన్యూర్ విధానం తెచ్చామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రపెన్యూర్ విధానాన్ని తెచ్చి ఎపి ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి చొరవ తీసుకుందని చర్చా వేదికలో పాల్గొన్న ప్రతినిధులు కితాబిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి సాధించేలా ఆదర్శవంతంగా ఉండేలా విధానాన్ని తీర్చిదిద్దారని చంద్రబాబును ప్రశంసించారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలకు, ఒన్ ఫ్యామ్లీఒన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునే వారికి గైడెన్స్ ఇస్తానని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ఇన్ఫ్రాను సిద్ధం చేస్తున్నామన్నారు. వినూత్న ఆలోచనలతో ఉన్న వారిని ప్రోత్సహించేందుకు పి4 అనే వ్యవస్థను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పి4 విధానం ద్వారా పేదరికాన్ని తగ్గించడంతోపాటు కొత్త ఆలోచనలు ఉన్న వారికి చేయూత ఇచ్చే విధంగా కూడా వ్యవస్థను తీర్చిదిద్దామన్నారు. ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా పారిశ్రామికాభివృద్ధిని ప్రమోట్ చేస్తున్నామని వివరించారు. టైమ్ మీడియా ప్రతినిధి టిమ్ హోవాట్, బ్లూమ్బెర్గ్ ప్రతినిధి జీనెత్ రోడ్రిగ్స్, బిజినెస్ టుడే ప్రతినిధి ఆలోక్ నాయర్, ఎన్డీటీవీ నుంచి ఆయుష్ ఐలావాదిలతో ఇష్టాగోష్టిలో సీఎం పాల్గొన్నారు.

**సిఎం చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ**

ముఖ్యమంత్రి చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ ్మ మిట్టల్ భేటీ అయ్యారు. అనకాపల్లి జిల్లాలో నిర్మించనున్న అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ పురోగతిపై చర్చించారు. తొలి దశలోనే దాదాపు రూ. 60 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ దశల్లో ఉన్న అనుమతులపై లక్ష్మీ ్మ మిట్టల్ సమక్షంలో అధికారులతో సిఎం సమీక్షించారు. ఫిబ్రవరి 15లోగా అనుమతులు, భూసేకరణ అంశాలు పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి 15 తరవాత అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని సిఎం కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతులు, ఇతర సహకారం విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని స్పష్టం చేసారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి త్వరితగతిన అవసరమైన అన్ని అనుమతుల సాధించాలని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లకు సిఎం సూచించారు. ప్లాంట్ నిర్మాణం విషయంలో మంత్రి లోకేష్ నిరంతరం పర్యవేక్షి స్తున్నారని ఆదిత్య మిట్టల్ అన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు గురించి లక్ష్మీ ్మ మిట్టల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. మంత్రులు లోకేష్, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన తమరా లీజర్ సిఇఒ సృష్టి శిబులాల్

**సిఎం చంద్రబాబుతో తమారా లీజర్ సిఇఒ భేటీ**

ఆంధ్రప్రదేశ్‌లో ఆతిథ్య రంగంలో పెట్టుబడులపై తమారా సంస్థ ప్రతినిధులు సిఎంతో చర్చించారు. ఏపీలో హోటల్ రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి విశ్లేషించారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని వివరిచారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి నదీ తీరంలో అద్భుతమైన టూరిజం కేంద్రాలు అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందని సిఎం తెలిపారు. కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి లాంటి మంచి పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులు ప్రారంభించే అంశాలపై సిఎం చర్చించారు.

ప్రస్తుతం ప్రతీ పర్యాటక ప్రాంతానికీ రోడ్లు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పుడు ఎపి అన్ లాక్ అని తమారా లీజర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి తెలిపారు. టూరిజం ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని ఉపాధి కల్పిస్తుం దని తెలిపారు. ఉత్తరాంధ్రనుంచి రాయలసీమ వరకూ ప్రతీ జిల్లాలలోనూ పర్యాటక కేంద్రాలున్నాయని స్పష్టం చేసారు. హోటల్ రంగానికి మేం ప్రోత్సాహం ఇస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ఎపిలో ప్రాజెక్టులు పెట్టేందుకు ప్రతిపాదనలతో వస్తే సహకరిస్తామని సిఎం స్పష్టం చేసారు. గిరిజన ప్రాంతాల్లోనూ ఎకోటూరిజం పార్కులు ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని తమారా లీజర్ సంస్థ తెలిపింది. విశాఖ సహా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు కూడా ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడించింది.

# మార్కెట్ విలువ మళ్లీ పెంపు

>> ఆదాయ వనరుగా మారనుందని విశ్లేషకులు చెబుతు న్నారు. ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. దీంతో భూముల కొనుగోలు-విక్రయాల సమయంలో ఎక్కువ స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, దీర్ఘకాలంలో భూముల ధరలు పెరగడం వల్ల ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఈ నిర్ణయం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొంటున్నారు.

# ప్రకృతి సాగు చేద్దాం... భూమిని బాగు చేద్దాం

## ప్రపంచానికి నమూనాగా ఎపిలో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నాం

## ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి సాధ్యమే

## ప్రకృతి సేద్యం-ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తిపై ప్రపంచ ఆర్థిక సదస్సు రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి సాగు చేయాలని... భూమిని బాగు చేసేలా వ్యవసాయం, ఆహార ఉత్పత్తులను పండించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తులపై హైలెవల్ మీటింగ్... అలాగే రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు ఎపిలో ప్రకృతి సేద్యానికి తీసుకుంటోన్న చర్యలను వివరించారు. అలాగే గ్లోబల్ మార్కెట్లో నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్స్‌కు ఉన్న డిమాండుకు తగ్గట్టు రాష్ట్రం ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలను సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రకృతి ఆధారిత వ్యవసాయం చేసేందుకు పూర్తి స్థాయి సన్నద్ధంగా ఉంది. ప్రకృతి సేద్యం అనేది కేవలం ఒక వ్యవసాయ పద్ధతి మాత్రమే కాదు, వాతావరణ మార్పులను ఎదుర్కొనే ఒక శక్తివంతమైన ఆయుధం. రాష్ట్రంలో ఇప్పటికే 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ఎటువంటి ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ప్రకృతి సేద్యానికి సంబంధించి ప్రపంచానికే ఎపిని ఓ నమూనాగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఎరువుల వినియోగం.. రసాయనాల వినియోగంతో చేసే వ్యవసాయంతో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. రైతులకు మొదటి సంవత్సరం నుంచే అధిక నికర ఆదాయం లభిస్తోంది... రైతులు బలోపేతం కావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

**పర్యావరణానికి మేలు చేసేలా... గ్లోబల్ మార్కెట్టుకు తగ్గట్టుగా..**

"ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిలో కార్బన్ నిల్వ సామర్థం పెరుగుతుంది... అలాగే పర్యావరణానికి మేలు జరుగుతుంది. అలాగే నీటి వినియోగం తగ్గడంతో పాటు బయోడైవర్సిటీ పెరిగేలా చూసుకోవచ్చు. అలాగే భూసారం తగ్గకుండా భూమిని మరింత బలంగా పోషకాలు ఉండేలా చేసుకోవచ్చు. ఫార్మర్ టు ఫార్మర్ అనే పద్ధతిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి గ్రామానికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రకృతి సేద్యంలో అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు శిక్షణ ఇచ్చేలా వ్యవస్థను రూపొందించాం. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్లలో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి వీలుగా సరైన మార్కెటింగ్ వ్యవస్థను, సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. టెక్నాలజీని ఉపయోగించి రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. అయితే ప్రకృతి సాగును ప్రొత్సహించేందుకు మెరుగైన పారిశ్రామిక పద్ధతులు, ఆర్థిక ప్రోత్సాహకాలు అవసరం. వ్యాపార సంస్థలు తమ ఆర్థిక లాభాల పరంగానే కాకుండా... పర్యావరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్టులో ఉన్న డిమాండ్ ను అంచనా వేసుకుంటూ అంతర్జాతీయంగా రాష్ట్ర ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా భారీ ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ఓ పెద్ద బిజినెస్ ఆపర్చునిటీగా నిరూపించే దిశగా ఎపిలోని రైతులను సిద్ధం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# బడ్జెట్ సమావేశాల్లో అమరావతికి చట్టబద్ధత!

## పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధం

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధతకు కేంద్రం సన్నద్ధమవుతుంది. విభజన చట్టాల అనంతర పరిణమాలు, నిర్ణయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఎపిలో ఇప్పటికే దగ్గర,దగ్గర దశాబ్ద కాలం నుంచి అమరావతి రాజధానిగా ఉంది. దేశ మ్యాప్‌లో సైతం అమరావతిని ఎపి రాజధానిగా సూచించారు.అయితే సాంకేతిక అంశాల కారణంగా అమరావతి రాజధాని చట్టబద్ధతకు అనుమతి రాలేదు. ఎపి తాజా కేంద్రమంత్రి మండలిలో ఈ అంశంపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.కేబినెట్ ఆమోదం తర్వాత పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. ఎపి విభజన చట్టం పార్ట్2 కింద 5(1) నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది. పార్ట్2 కింద 5(2) సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది.

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు. పార్ట్ 25(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు. వాస్తవానికి 10 ఏళ్లపాటు 2 రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ గడువు 2024 జూన్ 2తో ముగిసింది. రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, నిర్మాణాలపై కేంద్రానికి నోట్ అందజేసింది. ఏ తేదీ నుంచి రాజధానిగా ప్రకటించాలో కేంద్ర హోంశాఖ చెప్పాలంది.

2024 జూన్ 2 నుంచే రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. సంబంధిత కేంద్ర శాఖల నుంచి హోంశాఖ అభిప్రాయాలు కోరడంతో పలు మంత్రిత్వ శాఖలు ఇప్పటికే తమ అభిప్రాయాలు వ్యక్తపరిచాయి. పట్టణాభివృద్ధి, న్యాయ శాఖలు ఇంకా అభిప్రాయాలు చెప్పాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చించి ఆమోదించనున్నట్లు తెలిసింది.

ఈ మేరకు కేబినెట్ నోట్ తయారీలో హోంశాఖ నిమగ్నమైనట్లు అధికారులు వెల్లడించారు. రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నది. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఒయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ సహా ఎన్నో కంపెనీలు రానున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండో విడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరిస్తున్నారు.

# రూఫ్‌టాప్ సౌరవ్యవస్థల అమలు వేగవంతం చేయాలి

## మే నెలాఖరుకు 2లక్షల సౌరవిద్యుత్ కనెక్షన్లు పూర్తికావాలి

## ఎస్పీడిసిఎల్‌కు రాష్ట్ర సిఎస్ విజయానంద్ ఆదేశం

**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్‌వినియోగాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ కె.విజయానంద్ ఎస్పీడి సిఎల్ అధికారులను ఆదేశించారు. రానున్న మేనెలాఖరుకు రాష్ట్రంలో 2లక్షల సౌరవిద్యుత్ కనెక్షన్లు పూర్తికావాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా పిఎం సూర్యఘర్,ముఫ్త్‌బిజ్లీ యోజనను సమర్థవంతంగా అమలుచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సిఎండి శివశంకర్‌లో తేటి, నెడ్కాప్ ఎండి ఎం.కమలాకర్‌బాబు, ఎస్పీడిసిఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, తొమ్మిదిజిల్లాల ఎస్పీడిసిఎల్ సంస్థ ఎస్ఇలతో సౌరవిద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. ఫీడర్ సోలరైజేషన్, రూఫ్‌టాఫ్ సౌర ప్రాజెక్టుల అమలును క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించి నాణ్యతతో దీర్ఘకాలిక పనితీరును నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది మార్చినెలాఖరుకు 1.50లక్షల రూఫ్‌టాప్ సౌర కనెక్షన్లు పూర్తిచేయాలని, మేనెలాఖరుకు 2లక్షలు కనెక్షన్లు లక్ష్యంగా తీసుకుని పనిచేయాలన్నారు. నిర్ణీత సమయంలో లక్ష్యం పూర్తిచేయడానికి అధికారుల పర్యవేక్షణ ఉండాలని నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు,రూఫ్‌టాఫ్ సౌరవ్యవస్థలు, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అమలును నిర్దిష్ట కాలపరిమితితో వేగవంతంచేయాలని ఎస్పీడిసిఎల్, నెడ్కాప్ ఎండిలను ఆదేశించారు. భూసేకరణ, లీజ్‌రిజిస్ట్రేషన్లు,శాఖల మధ్య అనుమతులు ప్రాజెక్టుల అమలును పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని పిఎంసూర్యఘర్, ముఫ్త్‌బిజ్లీ యోజన క్రింద అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలన్నారు.ఫిబ్రవరి రెండోవారంలో జరగనున్న కలెక్టర్ల సమావేశంలో ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షిస్తామన్నారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా వెంటనే మీటరింగ్ పూర్తిచేయాలని సిఎస్ దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు జరిగినా సంబంధిత డిఇలు,ఎడిఇలు వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని, వినియోగదారుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజయానంద్ హెచ్చరించారు. పిఎం కుసుం క్రింద రాష్ట్రవ్యాప్తంగా 1,162.80 మెగావాట్ల సామర్థ్యంతో ఫీడర్ సోలరైజేషన్ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, సుమారు 2.93లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. యూనిట్‌కు సగటున 3.09 రూపాయల టారిఫ్‌తో ఆమోదించబడిందని ఎస్పీడిసిఎల్ అధికారులు సిఎస్ విజయానంద్ దృష్టికి తీసుకువచ్చారు. 2.07లక్షల కుటుంబాలు ఎస్సీ,ఎస్టీలు ఉండగా 415.67 మెగావాట్స్‌పవర్ సామర్థ్యంతో రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్ వ్యవస్థలు అమర్చామని వివరించారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకానికి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.



బుధవారం తిరుపతిలో సౌరవిద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎస్ విజయానంద్

## వారం - వర్జ్యం

22-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం,ఉత్తరాషాఢ కార్తె
చవితి రా.2.27
శతభిష మ.2.24,
వర్జ్యం : సా.6.39-7.43
దు.ఉ.10.26-11.11,
2) మ.2.58-3.43
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**వృషభం:** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు.

**మిథునం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఉద్యోగపరముగా రావలసిన సౌకర్యాలు ఇబ్బందులకు గురిచేస్తాయి.

**కర్కాటకం:** డాక్యుమెంట్లు, ముద్రణాపరమైన రాణిబాకీలు, భూమి, స్థిరాస్తుల సంబంధితమైన విషయాలు నిదానంగా సాగుతాయి.

**సింహం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులను దూరంగా ఉంచండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది.

**కన్య :** కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకోని సర్దుకుపోవటం మంచిది.

**తుల :** ఓర్పు నేర్పులు మేలుచేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. ధనలాభం.

**వృశ్చికం:** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి.

**ధనుస్సు:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. ఇతరుల విషయంలో జోక్యం వద్దు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** బంధువుల నుండి మాట సహాయం పొందుతారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి.

**మీనం:** ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందు కుంటారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చట్టసభలకు రాకపోతే నో వర్క్ - నో పే!

>> తున్న చట్టసభల సభాపతుల 86వ అఖిల భారత మహాసభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలపట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అన్న అంశంపై అయ్యన్న ప్రసంగించారు. చట్టసభల్లో కొద్ది మంది శాసనసభ్యులు ఒక్క చర్చలో కూడా పాల్గొనలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అది చాలదన్నట్టు, సభకు అస్సలు హాజరుకాని సభ్యుల్లో ఎక్కువ మంది క్రమం తప్పకుండా వేతనాలు, భత్యాలు మాత్రం తీసుకుంటున్నారని వివరించారు. ఈ విషయం ఒక సభాపతిగా తనకు ఎంతో వేదన కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఎలా ఉండగలుగుతాం అన్నారు. ఈ రకమైన అనైతిక ప్రవర్తనను ఎలా సమర్ధించగలుగుతామని అయ్యన్న ప్రశ్నించారు. ఈ రకమైన వ్యవహార శైలిని నిషేధించే నిబంధనలేవీ లేకపోవడంతో మాకొక మార్గం చూపించాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. దీనికోసం సహ సభాపతుల సలహాలను సైతం కోరుతున్నానని అయ్యన్న పాత్రుడు అన్నారు. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థకు సంబంధించిన సమస్య కాదనీ, ప్రజలు ఇలాంటి ఉదాహరణలు చూపించి ప్రజాప్రతినిధులందరినీ ఒకే కోవలోకి తీసుకువస్తారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే విమర్శలు ఎవరికీ మినహాయింపు కాదని స్పీకర్ పేర్కొన్నారు.

ఈ విషయంలో తన వైపు నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రెండు సూచనలను చేశారు. ఒకటి సభకు హాజరుకాని వారికి 'నో వర్క్ - నో పే' నిబంధన వర్తింపజేయటమన్నారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే వారి వేతనాల్లో కోత వేసినట్టే, ప్రజాప్రతినిధుల జీత భత్యాల్లో సైతం కోతను విధించాలని ఈ సందర్భంగా సూచించారు. అప్పటికీ గుణపాఠం నేర్చుకోని ప్రజాప్రతినిధుల కోసం మరో అడుగు ముందుకు వేయాలన్నారు. వారిని మళ్లీ ప్రజా కోర్టులో నిలబెట్టడం తప్ప మరో మార్గం లేదని వెల్లడించారు.

**ప్రజలే సరైన గుణ పాఠం చెప్పాలి:**

దీనికి అవసరమైతే రాజ్యాంగాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించి అయినా సరే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను వెనక్కు పిలిపించే హక్కు కల్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఈ 'రైట్‌టురీకాల్' హక్కుతో ప్రజలే వారికి సరైన గుణ పాఠం నేర్పగలుగుతారని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులకు ఈ అధికారాలు, బాధ్యతలు ప్రజల నుంచి నేరుగా సంక్రమిస్తుండటంతో శాసన వ్యవస్థకు రాజ్యాంగంలో కీలకపాత్ర కట్టబెట్టారన్నారు.

ఇంత గురుతరమైన బాధ్యతలు, అధికారాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధుల పట్ల ప్రజల్లో నమ్మకం నానాటికీ సన్నగిల్లుతోందని అయ్యన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మనం సైతం ఓ సారి ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. అప్పుడే, విధి నిర్వహణలో ప్రజల మెప్పు పొందగలుగుతామని వెల్లడించారు. ప్రజలు మనల్ని చిన్న చూపు చూసేలా తప్పిదాలు చేయకూడదని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మరింత శ్రమించి, నిజాయితీగా, చిత్త శుద్ధితో, నిరంతరం పనిచేస్తూనే ఉండాలని తెలియజేశారు.

**కనీసం 60 రోజులైనా చట్ట సభలు జరగాలి,**

ప్రజల సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ, దురదృష్టవశాత్తు చట్ట సభల పనిదినాలు మాత్రం ఏటికాయేడు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఇది శాసన వ్యవస్థ అనారోగ్యానికి సూచిక అని స్పీకర్ అయ్యన్న వెల్లడించారు. ఏడాదికి కనీసం 60 రోజులైనా చట్ట సభలు పనిచేయాలని అభిప్రాయపడ్డారు. సభ తరచూ సమావేశమైతేనే సభ్యులు, ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, స్వల్ప వ్యవధి ప్రశ్నలు, సావధాన తీర్మానాలు ఇలాంటి పలు సాధనాలతో ప్రభుత్వాన్ని నిలదీయగలుగుతారని గుర్తు చేశారు.

అంతేకాకుండా తద్వారా ప్రజలకు జవాబుదారీగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. కమిటీలు కూడా తరచుగా చురుగ్గా సమావేశాలు జరపాలని సూచించారు. అప్పుడే, శాసనసభ ప్రాముఖ్యత, దాని ప్రయోజనం అందరికీ తెలుస్తుందన్నారు. శాసనసభ్యులు తమ విధులను ఏ మాత్రం నిర్వర్తించకపోవడం విచారకరమైన విషయం అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు విన్నవించారు.

వార్త

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

-సోక్రటీస్

# విద్యను ప్రైవేట్‌పరం చేయడం న్యాయమా?

**అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటిని, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది.**



రావులపాటి సీతారాం రావు

గతకాలం వైభవం చెప్పుకోవటం అప్రస్తుతమేమో కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉన్నత తరగతుల విద్యాభ్యాసం తోపాటు క్రింది తరగతుల విద్యార్థుల చదువులను గురించి సమీక్షిస్తే చాలా లోపాలు, కొట్టొచ్చినట్లు కనబడుతాయి. పూర్వకాలం లోని గురుకులాలలోని విద్యాభ్యాసం ఆచరించాల్సిన అవసరం ఈ మధ్యకాలంలో మళ్లీ ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవటం గమనిస్తూనే ఉన్నాం. అయితే ఆనాటి గురుకులాల్లోని విద్యార్థుల సంఖ్య చాలా పరిమితులకు లోబడి ఉండేది. ఈనాడు విద్యతో ఉద్యోగం ముడిపడి ఉండటం చేత ఇబ్బడిముబ్బడిగా సంఖ్య విద్యాలయాల్లో పెరుగుతున్నది. చదువుకున్న విద్యార్థుల నాణ్యత తగ్గుతున్నది. పుస్తకాల బరువు పెరుగుతున్నది. సంపాదించుకున్న విజ్ఞానం అరకొరగా ఉంటున్నది. చివరకు విద్యార్థతలు విద్యగరిపే అధ్యాపకుల విషయాలు, విశ్వవిద్యాలయాల నాణ్యత తగ్గుముఖం పట్టడం, ఎక్కువ మంది విద్యార్థుల ఆత్మహత్యలూ ఇలాంటి విషయాల్లో కూడా కోర్టులు దృష్టి పెట్టి ఆదేశాలు ఇవ్వాల్సిన పరిస్థితులు రాష్ట్రాల్లో ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో సుప్రీంకోర్టు తొమ్మిది ఆదేశాలు రాష్ట్రాలకూ, కేంద్రానికి ఇవ్వటం ఇటీవల విద్యార్థులనూ, విద్యాధికులనూ, విద్యాలయాలనూ ఆలోచింపచేసే విషయంగా మారింది. ఎక్కువగా విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి ప్రైవేట్‌పరం అవటంతో ఈ ప్రైవేట్ సంస్థలు ఆర్థిక కారణాలతో 'మాస్' లెవల్లో వివిధ తరగతుల్లో చేర్చుకొనే దుస్థితి దాపురించింది. ఎక్కువ సంఖ్యలో ఒక క్లాసులో విద్యార్థులుంటే, ఎంతవరకు అందరికీ సమస్థాయిలో విద్యగరపటం ఎంత కష్టమో ఈ విద్యాసంస్థలు పట్టించుకోకపోగా, మెరుగైన విద్యార్థులను గుర్తించి వారినే ప్రోత్సహించటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. 'సెలెక్టెడ్ విద్యాదానం' కొన్ని సంస్థలు, పేర్లు అందరికీ తెలుసు. ప్రస్తావించడం అప్రస్తుతం. విద్యార్థతలు కాకుండా ఆర్థికార్హతలు ఈ ప్రోత్సాహాలకు కారణంగా కనపడుతున్నాయి. ఈమధ్యకాలంలో అందుకనే కొన్నిప్రభుత్వాలు, విద్యాసంస్థలను మెరుగ్గా తీర్చిదిద్ది విద్యార్థుల భవిష్యత్తు సమదృష్టితో బేరీజు వేసి, ప్రోత్సహించాలని, నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఆచరణలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటేనే ఇలాంటి ప్రయత్నాలు విజయాలను సాధించగలవు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకనిర్దేశాలలో ఈ విషయం ప్రస్తావించారు. సుప్రీంకోర్టు, ఉన్నత విద్యలు,ప్రైవేట్‌పరం కావటంతో క్వాలిటీ తగ్గి క్వాంటిటీ పెరగటాన్ని గమనించింది. ఆర్థిక ప్రయోజనం కోసమే అన్న అంశాన్ని కూడా ఇందుకు కారణంగా పరోక్షంగా చూపెట్టింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 142 ప్రస్తావించి, మార్గదర్శక సూత్రాలలో రికార్డులు




భద్రపర్చటం, రిపోర్టింగ్ కాకుండా ఆత్మహత్యలు ఉన్నత విద్య చదివే వారిలో ఎందుకు పెరుగుతున్నాయన్న సమీక్ష, (అంటే హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్లలో) ప్రత్యేకంగా చేయాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా తగు నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్స్ రిజిస్ట్రార్ల వెకెన్సీలు త్వరగా భర్తీ చేయాలని స్పష్టపరిచింది. అదే విధంగా ఫ్యాకల్టీ ఖాళీలను భర్తీ చేయక తప్పదని కూడా ఈ ఆదేశాలలో చేర్చింది. విద్యార్థుల బాగోగులు ఈ ఆదేశాల అమలుపై ఆధారపడి ఉన్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు భారత దేశంలో, ప్రస్తుత లెక్కల ప్రకారం దాదాపు 50 శాతం ఉన్నత విద్యాసంస్థలలో (హెచ్.ఇ.ఐ) ముఖ్యంగా విశ్వ విద్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయని వేలెత్తి చూపింది. తమిళనాడులోని మద్రాసు యూనివర్సిటీని ఒక 'కేసు స్టడీ'గా భావించి ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ విశ్వవిద్యాలయానికి ముఖ్యంగా మహిళల విద్య విషయంలో దేశంలోనే ప్రముఖస్థానం ఉంది. క్వాలిటీ రిసెర్చికి ఈయూనివర్సిటీకి మంచి పేరు ఉంది. 1970 సంవత్సరంలో చదువు చెప్పేవిషయంలో ఈ సంస్థకు పెద్ద పేరు ఉండేది. తర్వాత ఆ పేరు క్రమేపీ తగ్గిపోయి యూనివర్సిటీ ప్రత్యేకతను కోల్పోయింది. అవసరమున్న టీచింగ్ స్టాఫ్ సంఖ్యలో సగం సంఖ్య మాత్రమే ఉండటం ఇందుకు ఒక కారణంగా చెప్పక తప్పదు. రీసెర్చి భాగం నామమాత్రంగా ఉంది. ఇంతకు ముందు ఫిలాసఫీ, మాథ్స్, బాటనీ సబ్జెక్ట్‌లో ఈ యూనివర్సిటీకి గర్వపడేంత గొప్ప పేరు ఉండేది. కానీ ఇప్పుడు ఆ పేరు ఛాయామాత్రంగానే మిగిలింది. ఈ యూనివర్సిటీ ప్రస్తావన ఎందుకంటే మనదేశంలో ఒకప్పటి ఉన్నత విద్య ఎంత ఉన్నతంగా ఉండేదో చెప్పటానికి మాత్రమే గవర్నర్లు ప్రభుత్వాలు పంపిన వైస్ ఛాన్సలర్ల నియామకాలను ఏదో ఒక వంకతో ప్రక్కన పెట్టటంతో వెకెన్సీలు భర్తీ చేయకపోవటంలో ఇలాంటి పరిస్థితి దాదాపు అన్నిరాష్ట్రాలలోవచ్చింది. ప్రభుత్వాలు తమకు రాజకీయంగా అనుకూలురు అయిన వారి పేర్లను పంపటం కూడా ఒక కారణం కావచ్చు. అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటిని, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది. ●


# కొత్త విత్తన చట్టంతో కొత్త కష్టాలు!

కొత్తగా తెచ్చిన విత్తన చట్టంలోని అంశాలుచూస్తే కొరివితో తలగోక్కున్నట్లే అనిపిస్తోంది. అంటే కోరికష్టాలు తెచ్చుకున్నట్టుగా ఉంది. అసలుసిసలు విత్తనాలకు నకిలీ విత్తనాలకు మధ్యతేడాతెలుసుకునే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. దేశంలోఎక్కడ చూసినా నకిలీవిత్తనాల వార్తలే వినిపిస్తున్నాయి. రైతులు ఎంతోమంది వాటి ప్రభావంతో వేరే దారిలేక ఆత్మహత్యలకు దిగుతున్నారు. దేశంలో 500 పైబడి ఉన్న విత్తన కంపెనీలు సాలీనా ఐదువేల కోట్ల రూపాయల విలువచేసే నకిలీ విత్తనాలను రైతులకి అంటగట్టగలుగుతున్నారు. సాధారణంగా జరిగే విత్తనాల సాగుకే బోలెడంత ఖర్చవుతుంది. తీరా ఖర్చుతడిసి మోపెడయ్యాక కానీ అవి నకిలీవని తెలియదు. అప్పుడు రైతు లబోదిబో అని గుండెలు బాదుకుంటాడు. నకిలీ విత్తనాలు తారసిల్లినపుడల్లా ఇలాంటి పరిస్థితే. ఇలాంటి విత్తనాలతో దేశవ్యాప్తంగా విత్తన వ్యాపార సంస్థలు 71వేల కోట్ల రూపాయలు మేరకు వ్యాపారం చేస్తున్నాయి. కొత్తగా రైతునుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం, ముసాయిదా విత్తన బిల్లు 2025ను ప్రవేశపెట్టింది. 1966 విత్తన చట్టాన్ని కొన్ని మార్పులు చేర్పులతో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్త విత్తన బిల్లు రూపు దిద్దుకోనుంది. అయితే ఇది ఎంతవరకు రైతుకు ఉపయోగకారిగా ఉంటుందో తెలుసుకోవడం కోసం మొన్నడిసెంబరు 11వరకు రైతుల సూచనల కోసం ప్రభుత్వం సమయం ఇచ్చింది. రైతు సంఘాలు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసాయి. కానీ ఈ బిల్లులోని అంశాల్ని పరిశీలించిన వామపక్ష రైతాంగ సంఘాలు కార్పొరేటర్‌లకు మాత్రమే అనుకూలంగా ఉన్నట్లు బహిరంగంగానే చెప్పాయి. ఈ ముసాయిదా విత్తనాల బిల్లు చట్ట రూపం దాలిస్తే అంతకు ముందున్న విత్తన చట్టాలు దాటిఉంటుంది. కొత్తగా వచ్చేచట్టం నాణ్యమైన విత్తనాలు సరఫరా మరింతగా మెరుగుపరుస్తుందని, ప్రధానంగా విత్తన వాణిజ్యంలో తీసుకోదగిన అన్ని జాగ్రత్తలు ఇందులో పొందుపరిచేందుకు ఉద్దేశించబడిన బిల్లు ఇది. సాధారణ సాగుదారులకు ఈ చట్టం పెద్దగా ఉపయోగించదని, విత్తన కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తుందన్న అపోహల్ని తీర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచన ఎలాఉందో తెలియాలి. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటే తప్ప వారు మారరు. విత్తనాలు వేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో కూడాప్రభుత్వాలు మీనమేషాలు లెక్క పెడుతున్నాయి. ఎవరైతే నకిలీ విత్తనాలు అంటగట్టారో వారి నుంచే పరిహారాన్ని రాబట్టే ప్రక్రియ చాలా అవసరం. విత్తనసంస్థలపై ఇటువంటి ఆర్థిక భారం పడుతుందన్న విషయం అమలులో ఉందని తెలిస్తేనే వారు రైతుల్ని ఇబ్బందుల్లోకి నెట్టరు. లేకుంటే వారి ఇష్టారాజ్యం. విత్తన విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రం లేకపోవడం కూడా ఒక లోపం. అందుకే రైతుకు అందే విత్తనాల నియంత్రణపై వ్యవసాయశాఖ అధికారులపర్యవేక్షణ ఉండడం అవసరం. నకిలీ విత్తనాల విక్రయ నేపథ్యంలో విత్తనాలు కృత్రిమ కొరతకు పాల్పడే వ్యవస్థలు, వ్యక్తులు కూడా తమ కార్యకలాపాలను వారు నిర్వహిస్తుంటారు. వాటిపై ప్రభుత్వం నిరంతరం కన్నేసిఉంచాలి. అలాంటి కంపెనీలను నిషేధించాలి. రైతులు సాంప్రదాయ పద్ధతిలో విత్తనాలుపోసుకునే రైతుకు కూడామరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వటం అవసరం. అలా కాకుండా విత్తన చట్ట సవరణ పేరిట ఎన్ని చట్టాలు తెచ్చినా ఉపయోగంలేదని రైతు సంఘాల వ్యాఖ్యానం. సంయుక్త కిసాన్ మోర్చా వంటి సంస్థలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బహుళజాతి కార్పొరేట్ విత్తన సంస్థలకు మాత్రమే ఈ బిల్లు మేలుచేస్తుందని ఆయా సంఘాలుఆరోపిస్తున్నాయి. రేపటి బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఈ బిల్లు చట్ట రూపం దాల్చేందుకు ఎన్ని అభ్యంతరాలువ్యక్తమవుతాయో చూడాలి. ఈ ముసాయిదా చట్టం సాంప్రదాయవ్యవసాయ పద్ధతులకు ముప్పు కలిగిస్తుందని, అంతేకాక రైతుల విత్తనాల కోసం ప్రైవేటు కంపెనీలపై ఆధారపడాల్సివస్తే భవిష్యత్తులో స్వయంగా విత్తనాలను తయారుచేసుకునే వారి హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆల్ ఇండియాకిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే అభిప్రాయపడుతున్నారు. తదుపరి పంట కోసం విత్తనాలు నిల్వచేసుకునే సాంప్రదాయాన్ని పంజాబ్ రైతులు పాటిస్తుంటారు. రేపేపుడోవిత్తన హక్కులను కార్పొరేట్లకు ధారపోస్తే రైతు బాగా నలిగిపోతాడని పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల్లో పరీక్షించి విడుదల చేసే ఏవిత్తన రకమైనా రాష్ట్రానికిగల ప్రత్యేక వ్యవసాయ వాతావరణ పరిస్థితుల్లో తప్పనిసరిగా వాడవలసివస్తే రైతుకు నష్టం కలుగుతుంది. అందుకే ఇది న్యాయపరమైన విత్తనచట్టం కాదని రైతు సంఘాలు ఘోషిస్తున్నాయి. రైతులకు చట్టబద్ధమైన పరిహారవ్యవస్థను రూపొందించాలని వారుకోరుతున్నారు. ఎన్నిసార్లు వ్యవసాయ చట్టాల సంస్కరణలకు తలపెట్టిన బిల్లులు రైతుల అభ్యంతరాలతో చట్టాలుగా రూపు దిద్దుకోలేదు. 1966 విత్తన చట్టం, అటుపై 1983 లో వచ్చిన విత్తన సవరణ కూడా అదే మాదిరి ఆగిపోయింది. ఈసారి పరిస్థితి అలాగే ఉంది. పెద్ద పెద్ద విత్తన కంపెనీలకే కొత్త విత్తన చట్టంకాపు కాస్తుందనీ, తక్షణ పరిహార లబ్ధిదొరకని చిన్నరైతు మరింత చితికిపోతాడని రైతు సంఘాల ఆలోచనగా ఉంది. ఏ విత్తనచట్టంలోనైనా నకిలీ విత్తనాలతో నష్టపడిన రైతుకు తక్షణ పరిష్కారం దక్కే మార్గాన్ని సూచించమని రైతు సంఘాలు అభ్యర్థిస్తున్నాయి. ప్రస్తుత బిల్లు వలన విత్తన రంగాన్ని కార్పొరేట్‌లు హస్తగతం చేసుకుంటాయని సంయుక్త కిషన్ మోర్చా ఈ ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.

> బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు. బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.
>
> జార్జి ఎలియట్



> మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.
>
> ప్లినీ



# ప్రజావాక్కు



### పెరుగుతున్న డయాబెటిస్ బాధితులు

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డయాబెటిస్ బాధితులున్న రెండో దేశంగా భారత్ నిలవడం ఒక తీవ్రమైన ప్రజారోగ్యసంక్షోభానికి నిదర్శనం. వేగవంతమైన పట్టణీకరణ, జీవనశైలి మార్పులు జన్యుపరమైన ముప్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు కేవలం సంపన్నవర్గాలకే పరిమితమైన ఈ వ్యాధి, ఇప్పుడు గ్రామీణప్రాంతాలకు, యువతకు సైతం వేగంగా విస్తరిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేఆహారం, మానసిక ఒత్తిడి, అస్తవ్యస్తమైన నిద్రఅలవాట్లు ఈ మెటబాలిక్ వ్యాధికి ఇంధనంగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తు, చాలా సందర్భాల్లో ఈ వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### శాంతి ముసుగులో అధికారం

గ్రీన్‌లాండ్‌ను ప్రపంచభద్రతకుఅనివార్యమని ప్రకటిస్తూ, నోబెల్ శాంతి బహుమతి ప్రస్తావనను కూడా జోడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, శాంతి కంటే శక్తి ప్రదర్శనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న రాజకీయ ధోరణిని బహిర్గతం చేస్తున్నాయి. ఇవి దౌత్యబద్ధమైన విదేశాంగవిధానానికి నిదర్శనం కాకుండా, అంతర్జాతీయవ్యవస్థను వ్యక్తిగత రాజకీయఅహంకారానికి లోబర్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో గ్రీన్‌లాండ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. కానీ ఆ ప్రాముఖ్యతను సాకుగా చూపి, ప్రపంచ భద్రత పేరుతో భూభాగాలపై హక్కులు ప్రకటించడం వలసవాద ఆలోచనలకు ఆధునిక రూపం ఇచ్చినట్లే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### వీధి కుక్కలను కట్టడి చేయాలి

ఆధునిక మానవుని జీవన విధానం మారింది. పల్లెల్లో ఉండడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. పల్లెటూరి జీవన విధానం పూర్తిగా కనుమరుగైపోతూఉన్నది. పల్లెటూర్లలో వీధి కుక్కలుండేవి. వాటిని విచ్చలవిడిగా వదిలేసేవారు. వ్యవసాయానికి పనికివచ్చిన పశువులను సాలల్లో కట్టేవారు. ఇప్పుడు పట్టణాల్లో ఖరీదైన కుక్కలను కొన్వెక్కి అద్దెలలో ఉన్నవారు కూడా బీరువాలో పదివేల నోట్ల కట్ట లేని వారు కూడా కొంటున్నారు. సోమలి కాపులు కాస్త కుక్కల కాపులుగా మారిపోయారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మూడో ప్రపంచ యుద్ధం!

ఒకరి దగ్గర ఉన్న డబ్బును ఇంకోకరికి ఎంతైనా ఇవ్వవచ్చును. దీనికి ఎవరి అనుమతి తీసుకోనక్కరలేదు. ఇదేమి విచిత్రమో వెనుజూలా ప్రతిపక్షనాయకురాలైన మరియామదుడో 2025 లో తనకొచ్చిన నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రేమ పూర్వకంగా ఐచ్ఛికంగా ఇచ్చివేసింది. దానికి ట్రంప్ ఆనందపడుతూ స్వీకరించడం వింతల్లో కెల్లా వింత. ఇతరదేశాలన్ని దీన్నిచూసి నవ్వుకున్నాయి. నోబెల్ బహుమతి ప్రదాతలయిన నార్వే దేశం వారు దీన్ని ఖండించారు. ఒకరు సంపాదించుకున్న డిగ్రీలు, మెడల్స్ ఒకరి నుంచి మరొకరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యే సరకుకాదు. ఎనిమిది యుద్ధాలను ఆపిన తనకు శాంతి బహుమతి రాలేదు కాబట్టి ఇక తానను కున్న పరిపాలనే చేస్తానని ట్రంప్‌చెప్పుకోవడం హాస్యాస్పదం. అంటే ప్రపంచ శాంతికి ఏదో విధంగా విఘాతం కలిగించే పనులు చేస్తాడనే అర్థం అవుతోందిగా.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పోలీసు వ్యవస్థలో మార్పులు

తెలంగాణ పోలీస్‌వ్యవస్థలో ఈ మార్పును అభినందించవచ్చును. పోలీస్ వ్యవస్థలో కొద్దిపాటి మార్పు తీసుకొచ్చినందులకు అభినందించవచ్చును. అట్లాగే పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యంలేకుండా పోలీస్‌వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి బాధితులకు మరింత చేరువగా మానవీయ కోణంలో సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధన విభాగం సీఐడి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇది పౌరులకు బాధితులకు శుభ పరిణామంగా భావిస్తున్నారు. ఇకపై బాధితులు ఠాణాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేకుండా పోలీసులే బాధితుల నివాసానికి లేదా వారు కోరిన ప్రదేశానికి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. నమోదుచేసే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పండ్ల పెంపకం చేపట్టాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు వల్ల తేమకూడా పెరిగింది. దాని వల్ల కొబ్బరి లాంటి తోటలు కూడా పెరిగే అవకాశం ఉండడంతో తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలి. ఉపాధి హామీ ప్లానింగ్ చేసేటప్పుడు పండ్ల తోటల పెంపకాన్ని ఒక ప్రాధాన్యాన్ని ఇవ్వాలి. గేట్ల వెంబడి నాటితే రైతులకు ఏ నష్టం కూడా వాటిల్లదు. అందుకని తెలంగాణలో పండ్ల పెంపకం చేపట్టడం వల్ల ఎటువంటి నష్టం ఉండదు.

-భారత అవినాష్, జనగామ

**మనవి** ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆన్‌లైన్ మోసాలతో జర జాగ్రత్త!

డా.పోలం సైదులు

సోషల్ మీడియాను వేదికగా చేసుకోని వర్క్‌ఫ్రమ్ హోమ్, పార్ట్‌టైం జాబ్, ఫిషింగ్, ఫేక్ కస్టమర్ కేర్, ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్, లోన్‌యాప్‌లు, జాబ్, వీసా, గిఫ్ట్, లాటరీలంటూ మోసాలు, ఓఎల్ఎక్స్, క్వికర్, ఇతర మార్కెటింగ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిమోనల్ లాంటి రకరకాల పేర్లతో సైబర్ నేరాలు చోటుచేసు కుంటూ డేటా చౌర్యానికి పాల్పడుతున్నాయి. ఆశకుపోయి కొంచెం ఆదామరిస్తేచాలు ఉన్నది పోగొట్టుకుని, అప్పులపాలై చిక్కుల్లో పడాల్సిందే. మొన్నీమధ్య వాట్సాప్‌లలో ఒక మెసేజ్ చక్కర్లు కొట్టడం అందరికీ తెలిసిందే. కంగ్రాట్యూలేషన్స్ మీరు గిఫ్ట్ గెలుచుకున్నారు. క్లయిమ్ చేసుకోండని మెసేజ్ దర్శనమివ్వడం, దానిని తాకగానే మరో పది గ్రూపు లకు పంపాలని, అలా చేసినవారి ఫోన్లలో వాట్సాప్ హ్యాక్ అయ్యి ఆ నంబర్ నుండి కాంటాక్ట్ నంబర్లకు మెసేజస్ వెళ్ళడం జరిగింది. వర్క్ ఫ్రమ్‌హోమ్ జాబులంటూ నెల జీతాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, రిజిస్ట్రేషన్ ఖర్చులను ముందుగానే జమచేయాలంటూ కండిషన్ పెడుతూ, తీరా చేశాక తీసుకోని ఉడాయించడం జరుగుతుంది. డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని మోసపూరిత మాటలు చెబుతూ, మొదట్లో నమ్మకం కలిగాక పెద్దమొత్తం వసూలుచేసి వారిని ఇబ్బందులకు గురిచేయడం, కేవలం బెట్టింగ్ కోసమే వివిధరకాల ఆటలు ఆడిస్తూ, క్షణక్షణానికి బెట్టింగ్స్ పెట్టి డబ్బులు కాజేయడం, పిల్లలను రకరకాల ఆటలకు అలవాటుపడేలా చేసి తర్వాత వారినుండి అధికమొత్తంలో డబ్బులు కాజేయడం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందడంతో చౌకగా ఇంటర్నెట్ అందరికి అందుబాటులోకి వచ్చి ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తూనే, ఏం జరుగుతుందో, ఎలా జరుగుతుందో, చివరికి ఏమోతుందోనన్న అనుమానం కలిగిస్తూ సగటుమానవున్ని కలవర పెడుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ప్రస్తుతం మనుషులు పేపర్‌కరెన్సీ లేకుండా లావాదేవీలు జరుపుతున్నారు. అన్ని రకాల బ్యాంకులు వారి బ్యాంకులకు సంబంధించి ప్రత్యేక యాప్‌లను డెవెలప్‌చేసి తమ కస్టమర్లకు అందుబాటులో తెచ్చి, ఫోన్ పే, గూగుల్ పే, పేటియం, ఆన్లైన్ పేమెంట్లకు యాక్సెస్ ఇవ్వడంతో, సాంకేతిక పరిజ్ఞానమునుపయోగించుకొని కొందరు సులభంగా డిజిటల్ నేరాలకు పాల్పడటం జరుగుతుంది. ఎవరైనా తమ ఫోన్‌లోకి ఒక యాప్‌ని డౌన్లోడ్ చేసుకోని ఉపయోగించాలంటే తన వ్యక్తిగత వివరాలను ఇవ్వాల్సివుంటుంది. అంటే తనకు తెలియకుండానే తన సమాచారం ఇతరులకు చేరుతుంది. ఇలా షరతులు,




దేశంలో ఇలాంటి విషయాలు తెలియకుండా ఇంటర్నెట్ వినియోగిస్తూ లావాదేవీలు జరుపుతూ మోసపోతున్నవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. సర్వేఆధారంగా వన్ టైం పాస్వర్డ్‌ను తమకు తెలియకుండా ఇతరులతో పంచుకున్నవారు 26శాతం వున్నారంటేనే అవగతమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకొని నేరాలకు దిగుతున్న సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాలను ఎంచుకొని వ్యక్తుల బ్యాంకు ఖాతా నంబర్, పాస్వర్డ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఓటిపిని పొంది డబ్బులను కాజేస్తున్నారు. మరీ ముఖ్యమైన ఆసక్తికర విషయమేమిటంటే తాము మోసపోయిన విషయాన్నీ అంగీకరిస్తున్నవారు అధికసంఖ్యలో వున్నారంటే దేశంలో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న డిజిటల్ నిరక్ష్యరాస్యులెందరో తెలియకనే తెలుస్తుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే డిజిటల్ నిరక్ష్యరాస్యుడు అంటే చదువురానివాడు కాదు. చదువొచ్చినా సాంకేతిక పరిజ్ఞానంలోని లొసుగులు తెలియవనివారని అర్థం. ఎంతో చదువు చదివి వివిధరకాల ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినవారున్నారంటే ఎలాంటి ఆశ్చర్యం అక్కర్లేదు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఉద్యోగి నెలజీతం బ్యాంకుల ద్వారానే తీసుకునే పరిస్థితి, వ్యవసాయదారులుక్రాప్‌లోన్స్, ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బును బ్యాంకుల ద్వారానే తీసుకోవాలి. అలాగే మహిళామండలి సభ్యులు ప్రతినెల వారు కొంతసొమ్మును బ్యాంకులలో జమచేసుకోవడం, నెలసరి వాయిదాపద్ధతిలో కట్టి తేర్చడానికి అప్పులుగా తీసుకోవడం అందరికి తెలిసినదే. అంటే ఇప్పుడు దేశంలో బ్యాంకులలో అకౌంట్ లేకుండా ఉన్నవారెవరైనా ఉన్నారంటే ఏదో చిన్నపిల్లలు మాత్రమే వుంటారు. ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరవాలంటే తమ ఆధార్ కార్డు, పాన్‌కార్డు సమర్పించాల్సిందే. ఎటిఎం కార్డు, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అయిపోయింది. సాంకేతిక విద్యనభ్యసించిన కొందరు తమ జ్ఞానానిఉపయోగించి సులభంగా డబ్బులు సంపాదించాలని వివిధరకాల సైట్‌లనుపయోగించి అవతలివ్యక్తుల సమాచారాలను తెలుసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. దేశంలో రోజురోజుకు అభివృద్ధిలో భాగంగా పరిణితి చెందుతూ నూతన సాంకేతిక తను పరిచయం చేస్తున్నా, అంతేవేగంతో నేరగాళ్ల సైతం వారి ఆలోచనలతో కొత్త కొత్త ఆవిష్కరణలు గావించి సైబర్ నేరగాళ్లకు ఒడిగడుతున్నారని చెప్పవచ్చు. అందుకే దేశంలోఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవడం, ఆన్‌లైన్ మోసాలు, హ్యాకింగ్, డేటా దొంగతనం వంటి ఫిర్యాదులను స్వీకరించి, సైబర్‌దాడుల నుండి ప్రజలను, సంస్థలను రక్షించడానికి అవగాహన కల్పిస్తూ, భద్రతా చర్యలనుసూచించడం జరుగుతుంది. అలాగే ఐపి అడ్రస్‌లు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో సైబర్ నేరస్తులను ట్రాక్‌చేసి పట్టుకోవడం, నేరాలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలనుసేకరించి, విశ్లేషించి శిక్షపడేలా చేస్తుంది. కావున ఎవరైనా ఏదైనాసైబర్ నేరానికి గురైతే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చు లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదుచేయవచ్చు. ప్రభుత్వంసైతం నేరాలపై వివిధ సర్వేల ఫలితాలను పరిశీలించి, సైబర్ నేరగాళ్ల ముప్పునుండి తప్పించుటకు, సాంకేతిక నిపుణలతో చర్చించి, ఇలాంటి నేరాలకు ఎవరు పాల్పడినా వెంటనేగుర్తించి, వారికి కఠినమైన శిక్షలు వేసేవిధంగా కృషి చేయాలి. ●

# సంకుచిత పోకడలు ప్రమాదకరం

ఐ.ప్రసాదరావు

ప్రాచీన కాలంలో ప్రపంచంలో బహుగా ప్రకాశించిన పర్షియా దేశం తదుపరి మతం ఆధార దేశంగా ఇరాన్ పేరుతో మారిపోయి, నేడు అతి దీన దేశంగా, అన్ని రంగాల్లో విఫలమై విలవిలలాడుతున్న అతిపేద దేశంగా ప్రస్తుతం మన కళ్లముందు కదలాడుతుంది. దీనికి ప్రధాన కారణం మతపరమైన కట్టుబాట్లు ఆచారాలు, పరిపాలన అభివృద్ధికి ఆటంకంగా ముఖ్యంగా మహిళలు అభివృద్ధికి గొడ్డలి పెట్టు అవుతున్న తరుణంలో ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆందోళనలతో అట్టుడుకుతూ, ఇతర దేశాల ఆధిపత్యం వహించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఆధునిక కాలంలో ప్రపంచం మొత్తం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక టెక్నాలజీతో దూసుకుపోతున్న తరుణంలో సహజవనరుల చమురు నిల్వలు ఉన్న ఇరాన్ దేశం సుభిక్షంగా ఉండవలసింది పోయి, తీవ్రమైన సంక్షోభంలో పడటానికి ప్రధాన కారణం మత ఆధారిత పరిపాలన అనే గ్రహించాలి. ప్రపంచ వ్యాప్తంగా రాజరికం, మత ప్రభువులు పాలన, నియంతల పాలన పోయి, దాదాపు ప్రపంచంలోని మూడోవంతు దేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సాగుతున్న దేశాలు ఏవిధంగా అభివృద్ధి పంథాలో సాగుతున్నాయో గుర్తెరగాలి. మత ఆధారంగా మన నుంచి విడిపోయిన మన పొరుగు దేశమైన పాకిస్థాన్ కూడా దాదాపు అన్ని రంగాల్లో దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. అంతేకాకుండా అసాంఘిక శక్తులకు ఆస్థానంగా మారింది. పాలన మత ఆధారంగా మారిపోతే, అభివృద్ధి ఆగిపోయి, ఈ ఆధునిక కాలంలో అధోగతి పాలు అవుతుంది అని చరిత్ర చెబుతోంది. ఏ దేశంలోనైనా అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మత ఆధారంగా ఉన్న దేశాల పాలనలో మహిళలకు తగిన ప్రాధాన్యత లేకపోవడం అంతేకాకుండా అణచి వేయడానికి ప్రయత్నాలు చేస్తుండటంతో ఆయా దేశాల్లో అశాంతి, ఆగ్రహావేశాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మానవ హక్కులు మంటగలసి అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు నేతలను ఉపేక్షించడం మంచిది కాదు. గత సంవత్సరం వరకు అనేక రంగాల్లో అభివృద్ధి చెందిన మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్ నేడు పరిపాలనలో మత ఆధారిత ప్రభావం పెరగడంతో దేశం అతలాకుతలం అవుతోంది. పరిస్థితి చేజారకముందే చర్యలు తీసుకోవడం ఉత్తమం అని గ్రహించాలి. అలాగే ఆఫ్ఘనిస్తాన్ కూడా మత ఆధారిత పరిపాలన వల్ల అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న పరిస్థితి. నేటి ఆధునిక



కాలంలో ఏ దేశంలోనైనా మత, కుల, లింగ, ప్రాంతీయ, భాష, రంగు, ఆధిపత్యం వంటి విషయాలు ఆధారంగా పరిపాలన సాగితే, తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని అన్ని దేశాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు. ఇక ఇటీవల కాలంలో మన దేశంలో కూడా 'ఒకే' అనే భావన ప్రోత్సహించడం జరుగుతుంది. భారతదేశం విశిష్ట లక్షణం 'భిన్నత్వంలో ఏకత్వం' ఈ విషయం మరచి పోయి నేటి పాలకులు ఒకే భాష, ఒకే మతం, ఒకే పార్టీ వంటిఅంశాలు ప్రోత్సహించడం జరుగుతుంది. ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. సరికదా భవిష్యత్తులో వివక్షత, విద్వేష, విభజన వంటి సంకుచిత ధోరణులు పెరిగి, దేశంలో అలజడులు ప్రభలే అవకాశం ఉంది అని గ్రహించాలి. తాత్కాలిక అధికారం కోసం, ఆధిపత్యం కోసం పరితపించే పాలకులు, భవిష్యత్తులో పెను ప్రమాదాలు అంచనా వేయాలి. భారత రాజ్యాంగం ఆశయాలు దృష్టిలో ఉంచుకోవాలి. నాకు అధికారం ఉందికదా అని ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విర్రవీగుతూ సామ్రాజ్యవాద ధోరణితో వివిధ దేశాలనుభయపెడుతూ ఆక్రమణకు సిద్ధం అవుతున్న తరుణంలో, తన మిత్రులు అనుకున్న యూరోపియన్ దేశాలు బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు గ్రీన్‌లాండ్ విషయంలో ఎదురు తిరుగుతున్నాయి. అనగా అతిగా ప్రవర్తిస్తే ఏ విషయంలోనైనా ఎదురుదెబ్బ తగులుతుంది అని గ్రహించాలి. క్రీ.శ ఒకటవ శతాబ్దం నుంచి నేటి వరకూ ప్రపంచం వ్యాప్తంగా అనేక ఆర్థిక సామాజిక రాజకీయ మార్పులు వచ్చాయి. అందరూ సమానమే అనే భావన పురుడు పోసుకుంది. మాగ్నా కార్టా, మానవ హక్కులు, సహజ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వం, సామ్యవాదం లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి అనేక అంశాలపై నేటి ప్రభుత్వాలు పనిచేయవలసిన ఆవశ్యకత ఉంది. ఇవి అన్ని దేశాలు గుర్తించాలి. మన దేశ పాలకులు కూడా ముఖ్యంగా రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పరిపాలన అందించాలి. అధికారం అందిపుచ్చుకోవడానికి అడ్డదారులు తొక్కరాదు. ఆయా రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను రెచ్చగొట్టి, ఓట్లు దండుకోవడం మంచిది కాదు. ఆయా రాష్ట్రాల్లో పరిపాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపి, ప్రజలను చైతన్యవంతం చేసి మరింత మెరుగైన పరిపాలన అందిస్తాం అనే భరోసా కల్పించాలి. ఓట్లు రాబట్టుకోవడం మంచిది. అంతేకాకుండా కుల, మత, భాష ఆధారంగా ఓట్లు దండుకోవడం మంచిది కాదు. ఏది ఏమైనా ప్రస్తుత ప్రపంచంలో అధికారం, ఆధిపత్యం ధోరణులు పెరుగుతున్నప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఐక్యమత్యంతో సంఘటితంగా ఉండాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే వారిని బలపరచాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా పరిపాలన అందించడంలోనే భవిష్యత్తు ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది అని అందరూ ముఖ్యంగా పాలకులు గ్రహించాలి. మీడియా కూడా కీలక పాత్ర పోషించాలి. ●

# పర్యావరణానికి ప్రమాదమన్న ప్రజాభిప్రాయం

- చాగల్లు రైతుల్లో వెల్లువెత్తిన ఆగ్రహం - కాలుష్యంతో పంటలు నాశనమేనన్న స్థానికులు

**పెద్దపప్పూరు(తాడిపత్రి),జనవరి21,ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామ పరిధిలోని సర్వే నం. 412పిలోని 4.83 హెక్టార్లలో మెస్సర్స్ లక్ష్మీదుర్గా కోల్ ట్రేడర్స్ చేపట్టనున్న డోలమైట్, క్యాల్సైట్ తవ్వకాల అనుమతి కోసం అధికారులు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. చాగల్లులోని ప్రతిపాదిత ప్రదేశంలో అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదికేశవ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ఏకపక్షంగా వ్యతిరేకత వ్యక్తం చేయడం విశేషం. ప్రతిపాదిత ప్రాంతానికి చుట్టూ ఉద్యానపంటల సాగు ఉన్నందున ఈ గనుల తవ్వకాలు తమ తోటల వద్ద పర్యావరణానికి ప్రమాదమని సమీప రైతులు అభిప్రాయపడ్డారు. తవ్వకాలకు అనుమతులు తీసుకునే సందర్భంలో గనుల యజమానులు చెప్పేదానికి, ఆ తర్వాత అమలు చేసేదానికి పొంతనే ఉండదని కొందరు రైతులు తెలిపారు. ఏడాదికి 18,165 టన్నుల డోలమైట్, 36,330 టన్నుల క్యాల్సైట్ తవ్వకాలకు అనుమతివ్వాలంటూ బాపట్ల జిల్లా కొల్లూరు మండలానికి చెందిన ప్రేమ్‌కుమార్ సజ్జా అనే వ్యక్తి లక్ష్మీదుర్గా కోల్ ట్రేడర్స్ తరపున దరఖాస్తు చేసుకోగా బుధవారం సాయంత్రం దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రావడంపై చాగల్లు, చిక్కేపల్లి గ్రామాల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు పర్యావరణ స్వచ్ఛంద సేవకులు సదరు ప్రతిపాదిత కంపెనీకి అనుకూలంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంపై కూడా స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉన్నా కూడా సదరు కంపెనీకి ఉన్నతాధికారులు అనుమతులిస్తే నిర్వహణ సందర్భంలోనైనా అడ్డుకొని తీరతామని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపప్పూరు మండల తహసీల్దార్ బాలాజీరాజు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు



ప్రజాభిప్రాయసేకరణలో వ్యక్తమైన వ్యతిరేకత

# భక్తుల పాలిట కొంగుబంగారం శ్రీ అశ్వత్థ నారాయణస్వామి

- మాఘమాసం అశ్వత్థం తిరుణాల ప్రారంభం



అశ్వత్థనారాయణస్వామి మూలవిరాట్

**పెద్దపప్పూరు, జనవరి 21 ప్రభాతవార్త**

భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలిచి కోరిన కోర్కెలు తీర్చి కష్టాలను కడతేర్చే దైవంగా మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోపి పెన్నానది తీరాన శ్రీఅశ్వత్థం క్షేత్రంలో వెలసిన శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి పూజలందుకుంటున్నారు.

మాఘమాసంలో అశ్వత్థం క్షేత్రం భక్తులతో కిటకిటలాడనుంది. మాఘమాసం నాలుగు ఆదివారాలు ఘనంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25వతేదీ మొదటి ఆదివారం, ఫిబ్రవరి 1వతేదీన రెండవ ఆదివారం, 8వతేదీన మూడవ ఆదివారం, 15వతేదీన నాల్గవ ఆదివారంతో తిరుణాల ముగియనుంది. ఈ తిరుణాలలో తినుబండారాల దుకాణాలు, రంగుల రాట్నాలతో ఆలయం పరిసరాలు భక్తులతో నిండిపోతుంది. తిరుణాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇఒ సుబ్రమణ్యం, సిబ్బంది గురప్ప, అరుణ్, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని భారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఎండ తాకిడి నుండి భక్తులకు ఇబ్బంది కలగకుండా చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరుణాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నాలుగు ఆదివారాలు తాడిపత్రి ఆర్టీసి డిపో వారు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. తిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

## వికసిత్ భారత్ పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**యాడికి, జనవరి 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు వద్ది రాజశేఖర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ జీ గ్యారంటీ రామ్ జీ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బిజెపి నాయకులు, అడిషనల్ ప్రోగ్రాం అధికారి మద్దిలేటి, ఎంపిడిఒ వీర్రాజు, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ గ్యారంటీ రామ్ జీ పథకం పేదలకు వరం లాంటిందని ప్రధాని నరేంద్రమోడీ పేద కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చారని అందువలన నిరుపేదలకు న్యాయం చేయాలనే అంకితభావంతో ఆయన కృషి చేస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు ఏడాదికి 125 ఉపాధి పని దినాలు కల్పించిన ఘనత మోడీదే అన్నారు. అవినీతిని కట్టడి చేసేందుకు కూలీలు పని చేసే చోట హాజరు నుండి జీతం చెల్లింపుల వరకు డిజిటల్ బయోమెట్రిక్ విధానం అవలంబిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రైతులు వ్యవసాయం చేసే కాలంలో కూలీల కొరతను తీర్చడం ద్వారా రైతులకు ఉపశమనం కల్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు పండు లక్ష్మీదేవి, మురళీకృష్ణ, కేత వెంకటరమణ, రంగస్వామి, జక్కరామయ్య, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

## జె.సి ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



జె.సి ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందచేసిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, జనవరి 21 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో ఈ నెల 31వ తేదీన శ్రీవాసవిమాత విగ్రహ మండపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం జె.సి నివాసంలో మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందచేసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

**గుడిబండ జనవరి 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, వెలుగు కార్యాలయం సిబ్బంది తో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న నారా లోకేష్ గారి జన్మదిన సందర్భంగా మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర జూనియర్ కళాశాల ప్రాంగణంలో నియోజకవర్గం లోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ హాజరవుతున్నారని కావున ప్రతి ఒక్క లబ్ధిదారులు సమావేశంలో పాల్గొనే విధంగా చూడాలని వెలుగు సిబ్బందికి అనిమేటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ త్రిశూల్, ఏపిఎం నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, ఎంపిటిసి వనజా శశిధర్, క్లస్టర్ ఇంచార్జీ బాలేపల్లి రాజు, లాయర్ శివకుమార్ భీమరాజు ,జయరామప్ప, మాస్, జవనదుకురంగ ,మారుతి, శ్రీకాంత్, భరత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## మేము చేసిన పనులకు బిల్లు చెల్లించండి

- వైస్సార్సీపీ వైస్ ఎంపీపీ కన్వీనర్,సర్పంచులు




ఎంపీడీవోతో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి నాయకులు

**అనంతపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం గ్రామపంచాయతీలో మేము చేసిన అభివృద్ధి పనులకు బిల్లు చెల్లించాలని వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ 2 గోవింద్ రెడ్డి, సర్పంచులు కోటప్ప గారి కృష్ణారెడ్డి, శీలక శారద ఆదినారాయణ రెడ్డిలో ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు లను వారి సాంబర్లో కలిసి అడిగారు. ఈ సందర్భంగా ఎంపీడీవో,డిప్యూటీ ఎంపీడీవో లు మీరు చేసే పనులకు అన్ని బిల్లు రెడీగా పెట్టుకోండి 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన తర్వాత తప్పకుండా మీ బిల్లులు చెల్లించడం జరుగుతుందని వారు తెలియజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిపై డిసిహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న దృశ్యం

**కనేకల్, జనవరి 21 (ప్రభాతవార్త):**

అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిసిహెచ్ఓ) డేవిడ్ సాల్మన్ రాజ్ గారు కనేకల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. డిసిహెచ్ఓ మాట్లాడుతూ, ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, రోగులకు సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగరాదు అని స్పష్టం చేశారు. అలాగే, చికిత్సా విధానాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో ఆసుపత్రిలోని మెడికల్ రికార్డులు, ఎన్టీఆర్ హెల్త్ సేవల అమలు స్థితి, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులు సూచనలు అందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్ షరీఫ్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ నిరీషా, డాక్టర్ హనీఫ్ సహా ఆసుపత్రి సిబ్బంది తక్షణంగా ప్రతి చర్యలో పాల్గొని వివరాలు సమర్పించారు.

## కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట కలెక్టర్ భరద్వాజ్

**ముదిగుబ్బ జనవరి 21 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రాళ్ల అనంతపురం వద్ద ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. బుధవారం సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ కేంద్రాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ మండలంలో ఎన్ని వేల ఎకరాలలో కంది పంట సాగు చేశారని ఎకరాకు సరాసరి దిగుబడి ఎన్ని కింటాలు పండాయని ఆరా తీశారు. తాసిల్దార్ నారాయణస్వామి మాట్లాడుతూ మండలంలో 7561 ఎకరాలలో పంట సాగు చేశారని ఎకరాకు సరాసరి నాలుగు క్వింటాలు దిగుబడి వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు29మంది రైతుల నుండి 434 క్వింటాళ్లు సేకరించామని తెలిపారు. ఈసందర్భంగాజాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు రైతులకు తెలియజేయాలని సూచించారు ఎంతమంది రైతులు ఎన్ని క్వింటాలు పండించిన సరాసరి రైతు కేంద్రాలకే వచ్చి కందులను విక్రయించాలని తెలిపారు వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు

## బసవతారక్ నగర్ ప్రధాన వీధి శుభ్రం




బసవతారక నగర్ ప్రధాన వీధిలోని చెత్తను శుభ్రం చేసిన దృశ్యం.

**అనంతపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం ఏ. నారాయణపురం పంచాయతీ బసవతారక నగర్ పోవు ప్రధానవీది చెత్త పేరుకుపోయి చెత్తమయంగా మారిపోయాయని అనే న్యూస్ వార్త దినపత్రిక లో బుధవారం పబ్లికేషన్స్ కావడంతో అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. ప్రధాన వీదీ చెత్తతామయంగా మారిన వీటిని శుభ్రం చేయించడం పై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదని మాటలు పంచాయతీలో వినిపిస్తుందని అధికారులదృష్టికి పత్రిక ద్వారా తీసుకుపోవడంతో వెంటనే అధికారుల స్పందించి పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం ఏడు గంటలకు వెళ్లి పంచాయతీ కార్మికులతో కలిసి ఇంటి ఇంటి నుంచి తడి పొడి చెత్త సేకరణ చేయాలని అధికారులు తెలియజేశారు. పై ఆదేశాలు పాటించని పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం కందుకూరు గ్రామ పంచాయతీ కృష్ణం రెడ్డి పల్లి గ్రామంలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణా నికి బుధవారంటీడీపీ నాయకులు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహాయ సహకారాలతో కృష్ణం రెడ్డిపల్లిలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శేక్షావలి నాయుడు, మండల క్లస్టర్ ఇంచార్జ రాగే మురళీమోహన్, నారా అనంతయ్య, తిరుపాలు, పూలఒబిరెడ్డి, రమేష్, తిరుపతయ్య, చట్ట సూర్యప్రకాష్, బాలకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మోనిక, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## చెత్త సేకరణ పనులను పరిశీలించిన జడ్పీ సీఈఓ

**అనంతపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ

అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయతీ లోని బ్యాంక్ కాలనీలో పంచాయతీ కార్మికులు ఇంటి ఇంటి చెత్త సేకరణ పనులు నిర్వ హిస్తున్న వాటిని బుధవారం జడ్పీ సీఈఓ శివ శంకర్ ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, కుక్కల పల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచా యతీ కార్యదర్శి యు. హిదయాతుల్లాతో కలిసి సందర్శించి, ప్రతి రోజు చెత్తను తడి చెత్త పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి వాటిని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి తరలించాలని పంచాయతీ కార్మికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల, నందిగాం సురేష్, జక్కంపూడి రాజను కలిసిన బసంపల్లి రామాంజనేయులు

**అనంతపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**

వైఎస్ఆర్సిపి సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ నందిగామ సురేష్, యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజాలను బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బసంపల్లి రామాంజనేయులు, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి విజయవాడకు విచ్చేసి సజ్జల రామకృష్ణారెడ్డిని, మాజీ ఎంపీ నందిగామ సురేష్‌ను, జక్కంపూడి రాజాను కేంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ కేసులు బాణాయిస్తున్న విషయాలను వారికి తెలియజేయడం జరిగిందన్నారు.



సజ్జల, నందిగాం, జక్కంపూడిలను కలిసిన వైసీపీ కార్యకర్తలు.

## ఘనంగా భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు



భక్త మార్కండేయ స్వామి పూజలో పాల్గొన్న డి.ఎస్.పి శివ నారాయణస్వామి

**నల్లచెరువు, జనవరి 21, ప్రభాతవార్త**

మండలంలోని కే.పూలకుంట రోడ్డు సమీపంలోని భక్త మార్కండేయ శివాలయం నందు జయంతి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు ఉదయ అనంతరం ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి, సురేష్ స్వామి, ఆధ్వర్యంలో సోడా ప్రచార పూజ ,గణపతి పూజ, నవగ్రహ పూజ, శివుని కి భక్త మార్కండేయ స్వామికి పంచామృత అభిషేకం ఏక వార రుద్ర అభిషేకం, శాంతి హోమం, వివిధ హోమాలు అర్చనలు శ్రీ చక్ర సమేత లక్ష్మీదేవి కుంకుమార్చనలు, మహా మంగళహారతి నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు ఈ జయంతి వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు పిలుపుమేరకు ముఖ్య అతిథులుగా కదిరి డిఎస్పి శివ నారాయణస్వామి, మరియు ఆర్డీవో వి వి ఎస్ శర్మ, పాల్గొని భక్త మార్కండేయ స్వామి శివాలయం నందు ప్రత్యేక పూజ లో పాల్గొన్నారు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం డీఎస్పీ కి, ఆర్డీఓకు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జింక ఆదినారాయణ, ఉపాధ్యక్షులు మరియు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జక్క లక్ష్మీనారాయణ, సెక్రటరీ గుత్తి రామకృష్ణ కార్యదర్శి చెన్నకేశవులు, సూర్యనారాయణ, తదితరులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతి సాధించేలా కృషి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం రవీంద్ర

**ఓబుళదేవరచెరువు, జనవరి 21, ప్రభాతవార్త**

మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతి సాధించేలా ఈ నారీ, సీఆర్పీలు కృషి చేయాలని ఏపియం రవీంద్ర సూచించారు. బుధవారం స్థానిక పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో ఈ నారీ , సిఆర్పీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నారీ, సిఆర్పీలు మహిళ సంఘాలు మరింత ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు వారికి అందుబాటులో ఉండాలన్నారు. సంఘాల సంస్థాగత నిర్మాణం, మన డబ్బులు-మన లెక్కలు, లింగ సమానత్వం, బ్యాంకు లికేజి రుణాలు, వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాధులు ఇతర అంశాలపై కూలంకుషంగా మహిళా సంఘ సభ్యులకు తెలియచేయాలన్నారు. మహిళా ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అందుతున్నాయా లేదా అందకపోతే ఎలా పొందాలి, పెరటి తోటల సాగు, వ్యవసాయ ఉత్పత్తులు సాగుకు ప్రోత్సహించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ పద్మావతమ్మ, సీసి వేణుగోపాల్, సోమశేఖర్‌రెడ్డి, రత్నమయ్య, ఓబీలు, అకౌంటెంట్ లక్ష్మి, ఈ నారీ, సిఆర్పీలు పాల్గొన్నారు.

## చందనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- రూ.2 లక్షల ఆస్తి నష్టం



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన దుస్తులు, కాలిపోయిన టివి

**యాడికి, జనవరి 21 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చందన గ్రామంలో రజక వృత్తితో జీవనం సాగించే యలమకూరు గోపాల్ ఇంటిలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో దాదాపు 2 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాము రజక వృత్తితో జీవనం సాగిస్తున్నామన్నారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలోని దాదాపు పది మంది రైతు కుటుంబాలకు చెందిన దుస్తులతో పాటు ఇంటిలోని సామాగ్రి, టివి దగ్ధమైనట్లు వారు వాపోయారు. షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు గోపాల్ విలేకరుల ఎదుట తన బాధను తెలుపుకున్నాడు. జరిగిన సంఘటనపై పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

## వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ

**తాడిపత్రిఅర్బన్, జనవరి 21 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని అనంతపురం బైపాస్‌రోడ్డులో బుధవారం రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ వాహనదారుల లైసెన్స్, ఆర్‌సి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ఆర్‌సిలు, లైసెన్స్‌లు, హెల్మెట్లు కలిగి వుండాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణీకులను తరలించరాదన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## తహసీల్దార్ కార్యాలయం తాత్కాలికంగా మార్పు

**నంబులపూలకుంట, జనవరి 21 ప్రభాతవార్త**

గురువారం నుండి తహసీల్దార్ కార్యాలయం తాత్కాలికంగా గ్రామ సచివాలయం-2కు మరమ్మత్తుల కారణంగా మార్చబడినదని మండల తహశీల్దారు దేవేంద్రనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున నంబులపుల కుంట మండల ప్రజలు, మండల అధికారులు, ప్రజాప్రతి నిధులు, పాత్రికేయ మిత్రులు ఈ మార్పును గమనించి కార్యాలయ పనుల నిమిత్తం నంబులపులకుంట గ్రామ సచివాలయం-2కు హాజరై సహకరించవలసిందిగా కోరారు.

## చోరీ చేస్తున్న వ్యక్తి పట్టివేత

**పుట్లూరు, జనవరి 21 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం చింతకుంట గ్రామంలో గత కొంతకాలంగా దానిమ్మ తోటల్లో కాయలు దొంగతనంగా ఎత్తుకెళ్లి విక్రయిస్తున్న వ్యక్తిని చింతకుంట, కందికాపుల గ్రామాల రైతులు ప్రత్యక్షంగా పట్టుకున్నారు. మార్కెట్‌లో దానిమ్మకాయలు టన్ను 2 లక్షలు ఉండడంతో వ్యసనాలకు బానిసై ఇలాంటి చోరీలకు పాల్పడుతుండేవాడు. రైతులు తమ పొలాల వద్ద సిసి కెమెరాలు అమర్చడంతో దొంగను పట్టుకున్నారు. పుట్లూరు గ్రామానికి చెందిన బాలచంద్ర అనే వ్యక్తి దానిమ్మకాయలు దొంగతనం చేస్తుండగా రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు.

# హెల్మెంట్ ధరించి మీప్రాణాలను కాపాడుకోండి

**- రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత - హెల్మెంట్ వాడకంపై అవగాహన బైకు ర్యాలీలో ఎస్పీసతీశ్ కుమార్**



హెల్మెంట్ ప్రతి ఒక్కరు ధరించాలంటూ అవగాహన కల్పిస్తూ బైకు ర్యాలీనిర్వహిస్తున్న ఎస్పీసతీశ్ కుమార్, డీఎస్పీ హేమంత్ కుమార్, సీఐ,ఎస్ఐలు



**ధర్మవరంటౌన్, జనవరి 21 ప్రభాతవార్త**

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెంట్ ధరించి మీప్రాణాలను కాపాడుకోవాలని సత్యసాయిజిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ సూచించారు.పట్టణంలో బుధవారం హెల్మెంట్ వాడకంపై ధర్మవరం సబ్డివిజన్ లోని పోలీసు అధికారులు, రవాణాశాఖ అదికారులు కలిసి చేపట్టిన బైకు ర్యాలీని జిల్లా ఎస్పీసతీశ్ కుమార్, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ప్రారంబించారు. ఈ బైకు ర్యాలీ టూటౌన్ పోలీసుస్టేషన్ నుంచి ప్రారంభమై కాలేజ్,కళాజ్యోతి, ఎన్టీఆర్ మీదుగా గాంధీసర్కిల్, కొత్త,పేటసర్కిల్, ఆరీసీబస్టాండ్, చెన్నకేశవపురం వరకు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...2025 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 555 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా అందులో 190 ప్రమాదాలు ద్విచక్రవాహనదారులకు సంబంధించినవే అన్నారు. ఇందులో కూడా 120 మంది ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. హెల్మెంట్ లేకపోవడమే అనేక ప్రాణ నష్టాలకు కారణమన్నారు. చాలా వరకు రోడ్డు ప్రమాదాలల్లో మృతికి ప్రధానకారణం హెల్మెంట్ ధరించక పోవడమేనన్నారు.భవిష్యత్తులో హెల్మెంట్ ను తప్పనిసరి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా ముందుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. వాహనాలు నడుపుతూ సెల్ఫోన్ మాట్లాడకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలను కూడా నడపడం ప్రాణాంతమని హెచ్చరించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చేవిషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలని జరగరాని సంఘటనలు జరిగితే కుటుంబాలు వీదినపడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అదికారి కరుణసాగర్ రెడ్డి, ఆర్టీఓ రాణి, సీఐలు రెడ్డప్ప, శ్రీదర్, సునీత, శివరాముడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# అనుమానస్పద పేలుడు పదార్థాల గుర్తింపు

**- నిర్వీర్యం చేసిన డిస్పోజబుల్ స్క్వాడ్**

**రామగిరి, జనవరి 21 ప్రభాతవార్త**



బాంబులను పరిశీలిస్తున్న బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్

మండల కేంద్రమైన రామగిరి పాత పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన లోకల్ ఇన్స్పెక్షన్ సమయంలో అనుమాన స్పద పేలుడు పదార్థాలను గుర్తించినట్టు ఎస్ఐ ప్రదీప్‌రాజు తెలిపారు. వెంటనే వీటిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించి బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్‌ను పిలిపించినట్టు ఆయన తెలిపారు. ఆ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ పరిసర ప్రాంతాన్ని భద్రతా కవచంలోకి తీసుకుని ప్రామాణిక భద్రతా విధానాలను అనుసరించి ఈ బాంబులను నిర్వీర్యం చేశారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి ఎవరికి ఎలాంటి గాయాలు, ఆస్తి నష్టం కలగకుండా పూర్తి చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

# అసాంఘీక కార్యక్రమాలను అరికట్టడానికే ఇలాంటి ప్రయోగాలు

**- డ్రోన్ కెమెరాలు ఎగరేసిన ఎస్ఐ శోభరాణి**

**అగళి, జనవరి 21 ప్రభాతవార్త**



డ్రోన్ కెమెరాలను ఎగరేస్తున్న ఎస్ఐ శోభరాణి

జిల్లా ఎస్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగళి మండలం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ మద్యం, ఇసుక రవాణా లాంటివాటితో పాటు మట్కా, పేకాట, బహిరంగంగా మద్యం సేవించడం, తాగి గ్రామాల్లో అల్లర్లు సృష్టించడం లాంటివి అరికట్టాలన్న ఉద్దేశ్యంతో వినూత్నంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖ డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేస్తోందని, అందులో భాగంగానే అగళి మండలంలో ఎస్ఐ శోభరాణి, ఏఎస్ఐ శ్రీరాములు, జమేదార్ నాయక్, సిబ్బంది మండల కేంద్రమైన అగళి బస్టాండ్ ప్రాంతంతోపాటు సరిహద్దు గ్రామాల్లో డ్రోన్ కెమెరాలను ఎస్ఐ శోభరాణి ఎగురవేశారు. ఈ డ్రోన్ కెమెరా అసాంఘీక కార్యకలాపాలతోపాటు ఇసుక అక్రమ రవాణా, అక్రమ కర్ణాటక మద్యం, ఇసుక వంటి వాటిని రైతుల పొలాల్లో స్టార్టర్లు, మోటార్లు ఎత్తుకెళ్లేవారు, మేకలు, గొర్రెలు, ఆవులను దొంగతనం చేసేవారిని అరికట్టడం కోసమే ఈ కెమెరాలను ఎగురవేశామని, ఇవి మొత్తం కెమెరాలో నిక్షిప్తంగా చేసుకుంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అవుతుందని ఈ కెమెరాలను ఎగురవేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ ఆశాభావం వ్యక్తం చేశారు.

# డివైడర్ను ఢీ కొట్టిన కారు

## తప్పిన పెను ప్రమాదం

**బత్తలపల్లి, జనవరి 21 ప్రభాతవార్త**



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న కారు

జాతీయ రహదారిపై మండల పరిధిలోని ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ధర్మవరానికి చెందిన గూండా రామాంజనేయులు, గూండా అర్చన బుధవారం కారులో అనంతపురం వెళుతుండగా ముస్టూరు క్రాస్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొనింది.అదే సమయంలో వెనుక వైపు నుండి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులోని భార్యాభర్తలు ఇరువురికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినింది.బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ కూలీలపై లేదా...?

**వజ్రకరూరు జనవరి 21 ప్రభాతవార్త**



అధికారులతో గోడు వెళ్లిపోసుకుంటున్న కూలీలు

కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమకూలీలపై లేదా అంటూ అధికారులను నిలదీసిన ఘటన బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. 2024 డిసెంబర్ రెండవ తేదీన 14 మంది ఉపాధి హామీ కూలీలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధి పథకం కింద నిర్మించిన సామూహిక ఇంకుడు గుంత ఏర్పాటు పనులకు వెళ్లారు. నేటికీ వీరికి వాటికి సంబంధించిన కూలీలు మంజూరు కాలేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన తమకు తెలియదని అప్పుడు ఉన్న అధికారులు ఎవరైనా వస్తే వాటి వివరాలు బయటకు వస్తాయంటూ చెప్పి పంపిస్తున్నారు తప్ప వారి సమస్యను పరిష్కరించడం లేదంటూ బాధిత కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పనులు చేస్తే వారికి దగ్గరుండి బిల్లులు మంజూరు చేశారు తాము కష్టపడి ఎండలో పనులు చేసిన బిల్లలు ఇవ్వరా అంటూ వాగ్వాదానికి దిగదంతో, సాంకేతిక సమస్యల వల్ల బిల్లు మంజూరు కాకపోయి ఉండవచ్చని అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి బిల్లులు మంజూరయ్యేలా కృషి చేస్తామని అధికారులు కూలీలకు హామీ ఇచ్చారు.

# కనకనపల్లిలోగడ్డివాము దగ్ధం 25 వేల ఆస్తి నష్టం

**అమరాపురం జనవరి 21 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆలదపల్లి పంచాయతీ కనకనపల్లి గ్రామానికి చెందిన దేవరాజు అనే రైతు గడ్డి వాము బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన సంఘటన చోటుచేసుకుంది. ఉన్నపలంగా గడ్డివాములో మంటలు రావడంతో రోడ్డుప్రక్కన ఉన్నరైతులు చూసి ఆర్పడానికి ప్రయత్నం చేశారు. మంటలు అధికం కావడంతో చల్లార్చడానికి కాలేదని రైతులు వాపోయారు. మడకశిర అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించడానికి ప్రయత్నించినట్లు అయితే మంటలు అధికంగా ఉండటంతో పూర్తిగా దగ్ధమై దాదాపు 25వేలు ఆస్తి నష్టం జరిగిందని నిరుపేద రైతు దేవరాజ్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, మాజీ సర్పంచులు పాండురంగప్ప ,చంద్రప్ప, మండల్ క్లస్టర్ టిడిపి కో కన్వీనర్ మంజు తారక్, పంచాయతీ టీడీపీ కన్వీనర్ యంజారప్ప, మాజీ పంచాయతీ టీడీపీ కన్వీనర్ రామకృష్ణ తదితరులు పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా నిరుపేద రైతును ఆదుకోవాలని వారు అధికారులను కోరారు.

# డిప్యూటీ తహసిల్దార్‌కు సన్మానం

**వజ్రకరూరు జనవరి 21 ప్రభాతవార్త**



ఆర్ఎస్ డిప్యూటీ తహసిల్దార్ కేశవరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

మండల తహసిల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కేశవరెడ్డి పదోన్నతిపై ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్‌గా గుంతకల్ ఆర్డీవో కార్యాలయంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది అయనకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. రీ సర్వేలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా అత్యంత చాకచక్యంగా గ్రామాలలో ఎటువంటి వివాదాలు లేకుండా రీ సర్వేని విజయవంతంగా నిర్వహించారని పలువురు కొనియాడారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ మాట్లాడుతూ విధులలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరేష్ కుమార్, కార్యాలయ సిబ్బంది, డీలర్లు తిరుపాలు, లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లు... అభివృద్ధికి నాంది..!

**ధర్మవరం రూరల్ జనవరి 21 ప్రభాతవార్త**



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి

గ్రామీణ రోడ్లు అభివృద్ధికి నాంది అని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం రూరల్ మండలం చింతలపల్లి పంచాయతీలో ఎనర్జీ ఎస్ బి టి రోడ్డు పనులను ప్రారంభించారు. పంచాయతీరాజ్ మురళి, డిఈ పాండురంగారెడ్డి మాట్లాడుతూ చిగిచెర్లకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి వసంతపురం, చింతలపల్లి వరకు రూ.2.60 కోట్లతో తారు రోడ్డు పనులు చేస్తున్నట్లు వివరించారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. ఈకార్యక్రమంలో జేఈ వంశీ కృష్ణ, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమాదేవి, శంకర్ నాయుడు, భీమనేనివిజయ్‌సారథి, ఏలుకుంట్లరమణ,చక్కెరయ్య,ఎన్ పురుషోత్తం, హోలీ, ప్రసాదు,నాగభూషణ కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోరేవాండ్లపల్లి వద్ద ద్విచక్రవాహనం - ఐచర్ ఢీ

**- ఒకరు మృతి - మరొకరికి తీవ్రగాయాలు**



మృతి చెందిన రాజప్ప



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

**గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త**

అత్తారింటికి వచ్చిన అల్లుడిని స్వగ్రామంలో దింపి వద్దామని బయలుదేరిన మామ, అల్లుళ్లు మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై మామ మృతి చెందగా అల్లుడు తీవ్రగాయాల పాలైన సంఘటన బుధవారం గోరంట్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తనకల్లు మండల కేంద్రానికి చెందిన మామ రాజప్ప (62) మృతి చెందగా, అల్లుడు గోరంట్ల మండలం నార్సింపల్లి పంచాయతీ బూడిదగడ్డపల్లి గ్రామానికి చెందిన మల ఓబుల నరసింహప్పకు తీవ్ర గాయాలయ్యాయి. నరసింహప్ప సొంత పని నిమిత్తం తాను వివాహం చేసుకున్న తనకల్లుకు వెళ్లి తిరిగి తన మామతో కలిసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మండల పరిధిలోని కోరేవాండ్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి చెన్నై నుండి పెనుకొండకు వెళుతున్న ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ రాజప్ప, నరసింహప్పలను హుటాహుటిన గోరంట్ల ఆసుత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజప్ప మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ నరసింహప్పను మెరుగైన వైద్యం కోసం హిందూపురంకు తరలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రాము ఆసుపత్రికి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

# రథసప్తమి వేడుకలకు ముస్తాబవుతున్న సూర్యనారాయణస్వామి ఆలయం

**- ఆమిద్యాలలో 13వ శతాబ్దంలో చోళరాజుల కాలంలో నిర్మించిన ఆలయం - 3 రాళ్ళతో, 3 గర్భగుడులుగా త్రికోణ ఆకారంలో జరిగిన ఆలయ నిర్మాణం - 25న ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవం**

**ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త**



ఆమిద్యాల గ్రామంలోని సూర్యానారాయణస్వామి ఆలయం



సూర్యనారాయణస్వామి మూలవిరాట్, చెన్నకేశవస్వామి మూలవిరాట్, ఆలయంలోని శివలింగం

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలోగల 13వ శతాబ్దం చోళరాజుల కాలంలో (800 సంవత్సరాల క్రితం) నిర్మించబడిన పురాతన సూర్యనారాయణస్వామి ఆలయం ఈనెల 25వ తేదీన స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మాఘ మాసం శుద్ధ సప్తమి ఆదివారం జరిగే రథసప్తమి పర్వదిన వేడుకలకు ముస్తాబవుతోంది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామపూజ, ఆదిత్య హృదయ పారాయణం అనంతరం 9 గంటలకు ఛాయా, ఉషా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయం మూడు రాళ్ళతో 3 గర్భగుడులుగా త్రికోణ ఆకారంగా నిర్మించబడగా ఆలయంలో సూర్యనారాయణుడితోపాటు లక్ష్మిచెన్నకేశవస్వామి, శివుడిని కూడా ఆలయంలో దర్శించుకోవచ్చు. సూర్యనారాయణస్వామి పశ్చిమ ముఖ ంగా, ఈశ్వర లింగం తూర్పుముఖంగా, చెన్నకేశ్వరస్వామి దక్షిణ ముఖంగా ఇక్కడ కొలువుదీరి ఉండటం విశేషం. సూర్యనారాయణస్వామి వారికి సహజ సిద్ధంగా 7 గుఱ్ఱములు రథసారధి అసూరుడు రథ చక్రములు హస్తముల్లో పద్మములు, శిరస్సులో వర్తులాకారం కనిపిస్తుంది. దేశంలోనే 4వ దేవాలయంగా చెప్పబడే ఆలయానికి సరైన ప్రాచుర్యం లేకపోగా గత కొంత కాలంగానే గ్రామస్థుల ప్రత్యేక చొరవతో ఇక్కడ సూర్య దేవాలయం ఉందని బయటి ప్రపంచానికి తెలుస్తోంది.

# బీమాను సద్వినియోగం చేసుకోండి...!

**ధర్మవరం రూరల్ జనవరి 21 ప్రభాతవార్త**



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశువైద్యాధికారి

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు కల్పిస్తున్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఒక్కసారి బీమా సొమ్ము చెల్లిస్తే మూడేళ్ల పాటు వర్తిస్తుందని పశు వైద్యాధికారి శేఖర్ రైతులకు సూచించారు. బుధవారం ధర్మవరం మండలం ముచ్చరామి గ్రామములో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 30000 వేలు పశువులకు 85 శాతం రాయితీ తో 15 శాతం రైతు వాటా గా 298/రూపాయలు చెల్లించడంతో భీమా 3 సంవత్సరాలు బీమా వర్తిస్తుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీల యందు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరముల ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిభిరం లో చూలు కట్టని పశువులు చూడి నిర్ధారణ పరీక్షలు, బాహ్య పరాన్నజీవుల నివారణ కోసం గోమార్ల మందు పిచికారీ చేయడం జరిగినది. ఇందులో భాగంగా 51పశువులకు తగినచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ముచ్చురామి గ్రామంలో గొర్రెలు మరియు మేకలలో అంతర పరాన్న జీవుల నివారణ కోసం ఉచిత డీవార్మింగ్ మందులను 2400 జీవాలు కలిగిన గొర్రెల కాపారులకు అందజేశామన్నారు.22న గురువారం దర్శనమల, వెంకటతిమ్మాపురం గ్రామంలో ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం పశువైద్యసహాయకులు, గోలమిత్రలు రైతు సోదరులు పాలొన్నారు.

# రైతులు పశు భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**కనగానపల్లి జనవరి 21 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న పశువైద్యాధికారి డా" సునీల్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకం ప్రవేశపెట్టిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఇందులో గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, పందులకు ప్రీమియం చెల్లిస్తే ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. ఒక గొర్రెకు లేదా ఒక మేక కు ఒకటవ,రెండవ, మూడవ సంవత్సరం ప్రీమియం 27 రూ, 40 రూ, 56 రూపాయలు గొర్రె చనిపోతే ఆరువేల రూపాయలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఒక ఆవు, ఒక గేదకు రూ149 ,రూ 298,రూ 630 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే పశువు చనిపోతే 15వేలు 30వేలు 35వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని అలాగే 15 వేల నుండి ఒక లక్ష రూపాయల వరకు మూడు సంవత్సరాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని రైతులు బీమా చెల్లిస్తే చాలు అన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకొని పశువుల చనిపోతే నష్టపోకుండా ప్రభుత్వం నుండి పరిహారం పొందవచ్చని మండల పశు వైద్య అధికారి డా"సునీల్ కుమార్ తెలిపారు.మరిన్ని వివరాలకు మండల కేంద్రంలోని పశువైద్యశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

# రూ.5 లక్షలతో ఎస్‌సి కాలనీలో సిమెంట్‌రోడ్డుకు భూమి పూజ

**- టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి చేతులు మీదుగా పనులు ప్రారంభం**

**గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త**



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం ఎస్‌సి కాలనీలో బుధవారం అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖామంత్రి ఎస్. సవితమ్మ ఆదేశాల మేరకు దాదాపు 5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సవితమ్మ అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రతి గ్రామంలోను మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, సర్పంచు సరోజ నాగేనాయక్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్, మనోహర్, కురమాల జయరాం, రామాంజినేయులు. ఎస్‌సి,ఎస్‌టి మానిటరింగ్ కమిటీసభ్యులు ఉమాశంకర్, జయచంద్రరెడ్డి,మూర్తి, తెలుగు యువత మండల అధ్యక్షులు అచ్యుత్‌చౌదరి, ఉమాశంకర్, వెంకటరెడ్డి, ప్రకాష్, హరీష్‌రెడ్డి, అశ్వత్థ, సుభాన్, సంజీవప్ప, వెంకటరమణ, మల్లికార్జున, అక్ల నాయక్, గంగాధరప్ప, అంజి, 108 నరసింహప్ప, గంగాధర్, రాజు, రామాంజనేయులు, శ్రీశైలం శ్రీనివాసులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరిగి మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

**పరిగి, జనవరి 21:(ప్రభాత వార్త ):**

జిల్లాలోని పెనుగొండ డివిజన్ పరిగి మండలంలో కొనసాగుతున్న డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే పూర్తయి నూతన పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయవలసి ఉన్న గ్రామానికి చెందిన సి.హుస్సేన్ బీ అనే మహిళకు జిల్లా కలెక్టర్ గారే స్వయంగా... ఆధార్ ఫేస్ ఆతెంటికేషన్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసి డ్రాఫ్ట్ పట్టా ప్రతిని లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రీ-సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాలలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అత్యంత జాగ్రత్తగా ధృవీకరణ జరగాలని స్పష్టం చేశారు. పట్టాదారుల పేరు, కులం, లింగం, ఆధార్ నంబర్, చిరునామా వంటి వ్యక్తిగత వివరాలతో పాటు భూమి విస్తీర్ణాన్ని పూర్తిగా పరిశీలించి ధృవీకరించాలని అధికారులు మరియు లబ్ధిదారులకు సూచించారు. డ్రాఫ్ట్ పట్టాదారులో ఏవైనా లోపాలు ఉంటే తక్షణమే సరిదిద్దుకునే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం సిరికోలం రెవిన్యూ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, లోప రహితంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ ఎల్పీఎంల కారణంగా సంక్షేమ పథకాల లబ్ధి కోల్పోయే పరిస్థితులు తలెత్తవచ్చని, వాటిని వెంటనే సబ్ డివిజన్ చేయించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి పరిగిలోని కేజీబీవీ పాఠశాల, కోడిగినహళ్లిలోని అంధుల పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాల నిల్వలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం తప్పనిసరిగా అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌లో మెరుగైన శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎంపీడీవో రెడ్డప్ప, రీ-సర్వే మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, కేజీబీవీ మరియు అంధుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

# కమ్మల రామప్పకు కన్నీటి నివాళులు

**- బిజెపి జెండా కప్పి నివాళులు అర్పించిన...బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్**

**గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త**




నివాళులు అర్పిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కమ్మల రామప్ప అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ బుధవారం స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మృతుడు రామప్ప పార్థికదేహానికి కాషాయం జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిఎం శేఖర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు శివైక్యం కావడం బాధాకరమని అయన పార్టీకి అందించిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా తనను 1988లో భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించింది రామప్ప, రామచంద్రరావు అంటూ జిఎం శేఖర్ గుర్తు చేసుకున్నారు. రామప్ప 1962లోనే జనసంఘ్ పార్టీలో సేవలు అందించారని అదేవిదంగా అప్పటి నుండి కూడా భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా పార్టీ అభివృద్ధికి సేవలు అందించినట్లు అయన పేర్కొన్నారు. రామప్ప మృతితో పార్టీ ఒక పెద్ద దిక్కును కోల్పోయిందంటూ అయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ మేదర శ్రీనివాసులు, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, సీనియర్ నాయకులు రామచంద్రరావు, శంకర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పూల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు షబ్బీర్‌బాషా, బజంత్రీ శంకర, లక్ష్మీనరసు, కాచర్ల హరీష్, బాలకృష్ణ, గుంటిపల్లి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో గడ్డి వాములు దగ్ధం రూ.8 లక్షలు నష్టం

**గుత్తి, జనవరి 21 ప్రభాతవార్త**



గడ్డి వాములు దగ్ధమవుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కెపీఎస్ థియేటర్ వెనుక ఉన్న 8 గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు 8 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రాంతంలో నివాసం ఉండే హరికృష్ణ, రామకృష్ణ, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి, ప్రభావతిలకు చెందిన వరి పొట్టు, వేరుశనగ పొట్టులతో ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు భోరున విలపించారు. తమ పశువులకు మేత ఎలా వేయాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని వారు తెలిపారు. సంఘటనా స్థలికి చేరుకున్న అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారుల సహకారంతో నిప్పులు ఆర్పి వేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎలక్కుంట్ల లో ఉచిత పశు వైద్య శిబిరం

**కనగానపల్లి జనవరి 21 ప్రభాతవార్త**

మండలపరిధిలోని ఎలక్కుంట్లగ్రామంలో బుధవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితపశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలోఉన్న పాడిపశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు అలాగే చికిత్సలు చేయడం జరిగింది. అనంతరం డా" సునీల్ కుమార్, గ్రామస్తులతో కలసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏ హెచ్ ఏ స్నేహ, గోపాలమిత్రాలు రామాంజనేయులు, నరసింహమూర్తి రైతులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 21-01-2026 PM 10:02 Page 1



# 24న సుబ్రహ్మణ్యం షష్టి



రామగిరి, జనవరి 21 ప్రభాతవార్త

మండలంలోని పేరూరు గ్రామంలో పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 24, 25 తేదీలలో విశేష షష్టి, సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు పేరూరు గ్రామస్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సుబ్రహ్మణ్యం షష్టి ఆదివారం రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశేష పూజలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించబడుతుందన్నారు. సుబ్రహ్మణ్యం షష్టి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్‌డి హల్లిలో పశువైద్య శిబిరం

అగళి, జనవరి 21 ప్రభాతవార్త



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ డాక్టర్

మండల పరిధిలోని హెచ్‌డి హల్లి గ్రామంలో పశువైద్య శిభిరాన్ని నిర్వహించారు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలకు డీ వార్మింగ్ చేశారు. జిల్లా నుంచి ప్రత్యేకంగా వచ్చిన పశువైద్యాధికారి కిషోర్ ఈ శిభిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ శివన్న మాట్లాడుతూ.ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం సబ్సిడి దాణా పంపిణీ చేస్తోందని, దాణా విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేస్తోందని, ఉచితంగా మందులు, వ్యాక్సిన్‌లు అందజేస్తోందని తెలిపారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు భీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామకృష్ణప్ప, వెటర్నరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆకస్మిక తనిఖీ



పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఎంఈఓ

అగళి, జనవరి 21 ప్రభాతవార్త

ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు బత్తలపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారు. ఏ మేరకు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను నేర్చుకున్నారు అన్న విషయాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు హనుమంతరాయుడు, ఎల్లారెడ్డిలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టూడెంట్ అసస్మెంట్ బుక్ ప్రశ్నపత్రాలు, మ ధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులు, ఆధార్ అప్డేట్, ఎఫ్ఎల్ఎన్ రికార్డులను గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

# ముగిసిన ఓంకారేశ్వరుని వార్షికోత్సవ వేడుకలు

బత్తలపల్లి,జనవరి 21 ప్రభాతవార్త



కలశారాధనలో పాల్గొన్న శివ దీక్షాపరులు



ఆలయ శిఖరంపై సంప్రోక్షణ నిర్వహిస్తున్న శివస్వాములు



యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త

మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపురసుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం వందలాది మంది శివ మాలదారుల నడుమ శివదీక్షాపరుల భజన లు,శివ నామస్మరణల మధ్య ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్య ప్రకాష్ బాబు,జెడ్పిటిసి కోటి సుధా దంపతులచే ఉదయాన్నే కలశారాధన,మహా పూర్ణాహుతి,కలశ ఉద్వాసన,ఆలయ సంప్రోక్షణ,ఆలయ దిగ్బతి,కార్యక్రమాలను ఆలయ పురోహితులు విరూపాక్ష రాజేష్ స్వామి నిర్వహించారు. అనంతరం శివపార్వతు లకు మహా మంగళ హార తి,భక్తులకుతీర్థ ప్రసాదాలు,వేద ఆశీర్వచనం అందజేశారు.ఆలయ శాశ్వత దర్మకర్త,కోటి సూర్యప్రకాష్ బాబు,జెడ్పీటీసీ సభ్యురాలు కోటీ సుధ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ విజయవంతంగా వార్షికోత్సవ వేడుకలను ముగించారు.వేడుకలకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా మార్కెండేయ స్వామి జయంతి మహోత్సవం



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీచేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, పద్మశాలీయ బహుత్తమ సంఘం సభ్యులు

ధర్మవరంటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

పట్టణంలోని మార్కెండేయ స్వామి ఆలయంలో బుధవారం పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో మార్కెండేయ స్వామి జయంతి మహోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆలయంలో మార్కెండేయ స్వామి మూలవిరాట్ కు పట్టువస్త్రాలతో పాటు వివిద రకాల పూలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు చేశార. అలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు.ఆస్పత్రిలో సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ చేతులమీదుగా రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీచేశారు.ప్రతిఏడాదిలాగే స్వామివారి జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం ప్రసిడెంట్ పుత్తరుద్రయ్య, వైస్ ప్రసిడెంట్ జింకానాగభూషణ, ప్రతినిదులు బాలకుల్లాయప్ప, వడకలబాస్కర్, పోలంకి వెంకటనారాయణ, పోలంకి రెడ్డప్ప, జింకారాజేంద్రప్రసాద్, బుధవారపుశీన, పురుషోత్తం, గంగాదర, గోవిందు, జానపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా కబడ్డీ పోటీలు



సెమీఫైనల్లో తలపడుతున్న బత్తలపల్లి, దర్మవరం జట్లు

బత్తలపల్లి, జనవరి 21 ప్రభాతవార్త

మండల కేంద్రమైన బత్తలపల్లిలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా వారంరోజులుపాటు నిర్వహించే ఇమామ్‌ఖాశీం గంధం ఉత్సవాలలో భాగంగా బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. హజరత్ ఏ హిమాం ఖాశీం ట్రస్ట్ చైర్మన్, నిర్వహకులు మక్తుం భాశీంవలి పోటీలను నిర్వహించగా ఏడు జట్లు పోటీలలో తలపడ్డాయి. అన్ని జట్లు తీవ్రంగా పోటీపడడంతో హోరాహోరీగా సాగాయి. బత్తలపల్లి, ధర్మవరం, తాడిపత్రి, యాడికి, అనంతపురం వివేకానంద స్పోర్ట్స్, ఆనంతపురం ఆర్డీటి, కౌకుంట్ల తలపడ్డాయి. లీగ్ పద్దతిలో జరిగిన పోటీల్లో బత్తలపల్లి, కౌకుంట్ల జట్లు ఫైనల్ కు చేరుకున్నాయి. గురువారం ఈ రెండు జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నది. ఈ పోటీలలో కోచ్లు రామయ్య, పృథ్వీ, నరసింహులు, అనిల్కుమార్. సంధ్య, గ్రామ పెద్దలు జక్కంపూడి నాగభూషణ, నలజాల తిరుపాలు, మక్తుం ఇస్మాయిల్, మక్తుం ముక్తుంసాబ్, మక్తుం ముబారక్, షేక్ బాబావలిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశం శనివారానికి మార్పు

బ్రహ్మసముద్రం జనవరి 21 ప్రభాతవార్త

23.01.2026న నిర్వహించవలసిన మండల సాధారణ సర్వసభ్య సమావేశము అనివార్య కారణాల వలన తేదీ:24.01.2026 (శనివారం) ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం, బ్రహ్మసముద్రం నందు నిర్వహించడం జరుగుతుంది . కావున సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు ఇతర ప్రజా ప్రతినిధులకు మార్పు చేసిన విషయం తెలియజేసి అందరూ తప్పకుండా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవలసినదిగా పత్రికా ప్రకటన ద్వారా ఎంపీడీవో రంగనాయకులు తెలియజేశారు.

# జననీ మండల సమైక్యలో శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమం దృశ్యం

బ్రహ్మ సముద్రం జనవరి 21 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలం జనని మడల సమైక్య నందు, ఈనారి లు శిక్షణ కార్యక్రమం జరపడం జరిగింది ఈ ఈనారి లు గ్రామ సంఘాలలోని సంఘాలు అన్ని బలోపేతం చేయడం వారికి లావాదేవీలు గురించి తెలియజేయడం ప్రభుత్వ పథకాలు గురించి అవగాహన కల్పించడం మరియు వారి జీవనోపాదులు మెరుగుపరచడం వంటి కార్యక్రమాలు గురించి వివరంగా వివరించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల సమైక్య అధ్యక్షురాలు కే సుకన్య గారు మరియు ఎల్ సి. హరినాథ్ రెడ్డి గారు క్లస్టర్ సీసీ లు కే తిప్పేస్వామి జి శ్యామన్న ఏ మారెప్ప బి దొన తిమ్మప్ప వేణుగోపాల్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సర్పంచ్ కూతురు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు

బ్రహ్మసముద్రం జనవరి 21 ప్రభాతవార్త



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం సంతేకొండాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ వనిత మల్లి కూతురు మధుప్రియ ఒకటవ తరగతి జన్మదిన శుభ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు విద్యార్థులకు పంపిణీ చేసి అనంతరం విందు భోజనం ఏర్పాటు చేయడం జరిగినది అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ నా కూతురితోపాటు తోటి విద్యార్థుల తో పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు. మహేష్కుమార్. ప్రవీణ్ కుమార్. వంట ఏజెన్సీ ప్రకాష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, జంకానాల పంపిణీ



మాట్లాడుతున్న సిడిపిఓ నాగమణి

కనేకల్ జనవరి 21 ప్రభాతవార్త

కనేకల్ మండల పరిధిలోని గోపులాపురం-2 అంగన్వాడీ కేంద్రానికి క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ - క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ఆధ్వర్యంలో అవసరమైన మౌలిక సదుపాయాలను అందించారు.రాయదుర్గం బ్రాంచ్ మేనేజర్ రామచంద్రప్ప, ఏరియా మేనేజర్ గంగాధర స్వామి నాయకత్వంలో కనేకల్ ప్రాజెక్ట్ ద్వారా అంగన్వాడీ కేంద్రానికి 34 కుర్చీలు మరియు 2 జంకానాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం సిడిపిఓ శ్రీమతి నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ నాగమణి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి దాతల సహకారం ఎంతో ఉపయోగకరమని, దీని ద్వారా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు మెరుగైన సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ముందుకొచ్చి సహకారం అందించిన క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థకు అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ గీత, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది పవన్, బసవరాజు, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకట్ రంగయ్య, అంగన్వాడీ సిబ్బంది సుజా, లాలెమ్మ, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# సిరగంవాండ్లపల్లిలో యువకుడు ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సిరగంవాండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ అనే యువకుడు బుధవారం ఉదయం తన నివాసంలో క్రిమిసంహారకమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ప్రసన్నకుమార్ ఈ సంఘటనకు పాల్పడడంతో హుటాహుటిన గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించి అక్కడి నుండి కర్ణాటక రాష్ట్రం చిక్ బల్లాపూర్ జిల్లా కేంద్రానికి తరలించినట్లు సమీప బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

# ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామయ్య



బాధ్యతలు చేపడుతున్న వెంకటరమణయ్య


ధర్మవరంటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న ప్రమోద్ కుమార్ గత ఏడాది ఆగస్టులో పదవీవిరమణ పొందారు. దీంతో మున్సిపల్ ఈఈ సాయిక్రిష్ణ ఇన్చార్జ్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కర్నూల్ జిల్లా డ్వామా పీడీగా విదులు నిర్వహిస్తున్న వెంకటరమణయ్య బదిలీపై ధర్మవరం మున్సిపాలిటీకి వచ్చారు. ఇక్కడ కమిషనర్ గా ఆయన బాధ్యతలుచేపట్టారు. దీంతోమున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దర్బార్ టీ కేఫ్‌లో హుండీల చోరి

## - టీ తాగడానికి వచ్చి ఎత్తుకెళ్లిన దొంగ

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త



హుండీను ఎత్తుకెళుతున్న దొంగ

పట్టణ శివారు రాములమ్మ గుడి పక్కనగల దర్బార్ టీ కేఫ్‌లో హుండీలు చోరీకు గురైన విషయం కొంత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 5.45 గంటల సమయంలో టీ కేఫ్‌ను తెరిచిన యజమాని నీటి మోటార్ ఆన్ చేయడానికిగాను వెనుక వైపునకు వెళ్లిన సమయంలో టీ తాగడానికి వచ్చిన ఒక వ్యక్తి ఎంచక్కా కేఫ్ లోపలికి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకొని అక్కడి నుండి వెళ్లిపోయాడు. దొంగ ఎత్తుకెళ్లిన హుండీల్లో ఒకటి దేవుని హుండీ కాగా మరొకటి టీ కేఫ్ బాడుగ కోసం ప్రతిరోజూ 700 రూపాయల చొప్పున పోగుచేసే హుండీ అని టీ కేఫ్ యజమాని తెలిపారు. రెండు హుండీలు కలిపి 50 నుంచి 60 వేల రూపాయలు ఉంటుందని ఆయన వివరించారు.

# ఎస్సీ జన సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా గుడిసెల రాజేష్

## - దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త



గుడిసెల రాజేష్

ఎస్సీ జన సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా గుడిసెల రాజేష్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరుగగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డా॥దాసగాని కుళ్లాయప్ప ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీను ఎన్నుకొని ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారికి ఆయన దిశా నిర్దేశం చేశారు. సంఘం జిల్లా నూతన వర్కింగ్ ప్రసిడెంట్ గుడిసెల రాజేష్ మాట్లాడుతూ ఇదివరకు సంఘం నియోజకవర్గ ఇంచార్జ్‌గా పనిచేసిన అనుభంతో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దళితులకు అండగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పకడ్బందీగా అమలు అయ్యేలా బాధితుల పక్షాన పనిచేయడం జరుగుతుందన్నారు. ఈసందర్బంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కర్నాటక రాష్ట్ర అధ్యక్షులు సాకే కుళ్లాయప్ప, రాయలసీమ ఇంచార్జ్ యాలేరు పెద్దన్న, నాయకులు చిరంజీవి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

## - ఇంటింటికీ ఉపాధి క్యాంపెయిన్ పోస్టర్లను విడుదల చేసిన సీపీఎం

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వారు ఇంటింటికీ ఉపాధి క్యాంపెయిన్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి నిరంకుశ వైఖరిని మరోమారు చాటుకుందన్నారు. ఆ స్థానంలో తీసుకువచ్చిన నూతన చట్టం ఉపాధి హామీ హక్కును దెబ్బతీస్తోందన్నారు. కేంద్రం లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 71 లక్షల మంది ఈ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని అత్యధిక మంది కూలీలు, పేద రైతులు సమాన పనికి సమాన వేతనం అందుకొంటున్న ఏకైక చట్టమన్నారు. జిల్లాలో 19.6 శాతం మంది దళితులు, 3.6 శాతం మంది గిరిజనులు అనగా 22శాతంమంది అట్టడుగువర్గాల పేదలు, మిగిలిన వారు వెనుకబడిన కులాల వారు, మైనార్టీలు, అగ్రకులాలకు చెందిన పేదలు ఉన్నారన్నారు. వీబీ జీరామ్ జీ పేరుతో ఉపాధి హక్కుకు రామ్ రామ్ చెప్పిన మోదీ ప్రభుత్వం రాష్ట్రాలపై భారం మోపుతూ కార్పొరేట్లకు లాభం చేకూరుస్తోందని మండి పడ్డారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేయడానికి సీపీఎం పార్టీ ఇంటింటి ప్రచారం చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు మురళి, రవికుమార్, సిద్దప్ప, రామాంజినేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విరుపసముద్రం రోడ్డు ప్రతిపాదనలకు 3.5 కోట్ల నిధులు మంజూరు

## ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు

అమరాపురం జనవరి 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని అమరాపురం నుండి విరపసముద్రం వరకు ఆర్ అండ్ బి రోడ్డు దాదాపు పది కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం ఆమోదించి దాదాపు 3.5 కోట్ల నిధుల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయడం పట్ల సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లకు ప్రత్యేక కృతజ్ఞతలుతెలియజేసినట్లు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కో కన్వీనర్ అగ్రహారం నవీన్ కుమార్ తెలియజేశారు. ప్రస్తుతం! టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని రహదారులు మరియు భవనముల శాఖ అధికారులు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం లో అర్ధాంతరంగా పనులను ప్రారంభించి నిలిపివేయడం ద్వారా ప్రయాణికులు,, వాహన చోదకులు తీవ్ర పడుతున్న పరిస్థితులు నెలకోవడంతో విధితమే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తక్షణమే అమరాపురం నుండి

# ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్టు

## - దొంగ సామాగ్రి స్వాధీనం

రామగిరి, జనవరి 21 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ పర్యవేక్షణలో, సీఐ మార్గదర్శకత్వంలో, రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరుగుతున్న వ్యవసాయ పొలాలు, ట్రాన్స్ఫార్మర్లకు సంబంధించిన దొంగతనాలపై అందిన నమ్మదగిన సమాచారంతో రామగిరి ఎస్.ఐ. ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తంగా చర్యలు తీసుకొని ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి భారీగా దొంగసామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నా సిబ్బంది అయిన ఎఎస్ఐ 2124, హెచ్‌సి1503, పిసి 2879, పిసి3672లు పాత భారత్ గోల్డ్ మైన్స్ సమీపంలో గస్తీ నిర్వహిస్తూ ఉండగా ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు కనిపించగా, మమ్మల్ని గమనించిన వెంటనే వారు పారిపోయేందుకు ప్రయత్నించడంతో వెంటనే పట్టుకొని విచారించాము. విచారణలో వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శవాబ్ అలి వయస్సు 25 సంవత్సరాలు, సోను వయస్సు 26 సంవత్సరాలు అని వెల్లడై, సుమారు రెండు సంవత్సరాల క్రితం కూలీ పనుల నిమిత్తం రామగిరికి వచ్చి సోలార్ ప్రాజెక్ట్ పనుల్లో పనిచేస్తూ, మద్యం, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై ఉపాధి ద్వారా వచ్చే ఆదాయం సరిపోక తమ చెడు వ్యసనాలను తీర్చుకోవడానికి రామగిరి, కనగానిపల్లి మండల పరిధిలోని రైతు పొలాలను లక్ష్యంగా చేసుకుని పగటి సమయంలో రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో వైరులు, డ్రిప్ పైపులు, ట్రాన్స్ఫార్మర్లలోని ఆయిల్, రాగి వైర్లను దొంగతనం చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ విధంగా వారు రామగిరి పరిధిలో నాలుగు దొంగతనాలు, కనగానిపల్లి మండల పరిధిలో ఆరు దొంగతనాలు చేసినట్లు తేలింది. నిందితుల వద్ద నుండి సుమారు 2 కిలోమీటర్ల రాగి వైర్ (అంచనా విలువ రూ. 80,000/) మరియు 18 బండల డ్రిప్ పైపులు (అంచనా విలువ రూ.30,000/) మొత్తం రూ.1,10,000/ విలువైన దొంగసామగ్రిని చట్టబద్ధంగా స్వాధీనం చేసుకొని, నిందితులపై తగిన చట్టప్రకారం కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల ఎస్.ఐ. టీ ప్రదీప్ రాజ్ రైతులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాలు, ట్రాన్స్ఫార్మర్లు మరియు వ్యవసాయ సామగ్రిని క్రమం తప్పకుండా పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# విద్యార్థులపై పశువుల దాడులు

## అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల ఆవేదన

కనేకల్ జనవరి 21 ప్రభాతవార్త



పశువుల దాడిలో ఆందోళన అవుతున్న విద్యార్థి

కనేకల్ మండల కేంద్రంలో బుధవారం ఉదయం పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులపై వీధుల్లో తిరుగుతున్న పశువులు దాడులకు పాల్పడ్డాయి. కొన్నిచోట్ల పశువులు విద్యార్థులను కొమ్ములతో పొడవడంతో భయాందోళనలు నెలకొన్నాయి. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరగకపోయిన విద్యార్థులు తీవ్ర భయానికి గురయ్యారు.గ్రామంలో పశువులు నిర్బంధం లేకుండా రహదారులపై తిరుగుతుండటంతో రోజువారీగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి, వీధుల్లో తిరుగుతున్న పశువులను గోశాలలకు తరలించి విద్యార్థులు, ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల సమయాల్లో పోలీస్, పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించిన ఏడిఏ



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి, జనవరి 21 ప్రభాతవార్త

మండలంలోని బసినేపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట పొలాల్లో చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని బుధవారం ఏడిఏ వెంకటరాముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పకుండా తాము సాగుచేసిన పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులకు జింకు మరియు జిప్సం అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఊటకల్లు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ముస్తాక్‌అహ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కృష్ణ, రామచంద్ర, మారుతినాయక్, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డే వెంకటనును అభినందిస్తూ... గజమాలతో రవిమోహన్ సన్మానం

## -జిల్లా గ్రంథాలయ చైర్మన్ వడ్డే వెంకట్‌ను సన్మానించిన సింగిల్ విండో అధ్యక్షులు రవిమోహన్

గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త



చైర్మన్‌ను సన్మానిస్తున్న రవిమోహన్

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వడ్డే వెంకట్‌ను బుధవారం గౌనివారిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు వై.రవిమోహన్ గజమాలతో సన్మానించారు. అదేవిధంగా ఓడిసి అంజనప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమర్నాథ్, అమడగూరు సుధాకర్, రమణ, నాగరాజు, శీనప్పల్లి గోవిందప్ప, జిల్లా నలుమూలల నుండి వచ్చినటువంటి వడ్డెర సోదరులు, వెంకట్ అభిమానులు వడ్డే వెంకట్‌ను సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియచేశారు.

# గోరంట్ల ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన...డిఎంహెచ్ఓ పైరోజ్‌బేగం

గోరంట్ల, జనవరి 21 ప్రభాతవార్త



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

గోరంట్ల మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని జిల్లా వైద్యాధికారిని (డిఎంహెచ్ఓ) ఫైరోజ్‌బేగం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిసరాల పరిశుభ్రతపై వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వరరావు, హెడ్ నర్సు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరపసముద్రం కర్ణాటక బార్డర్ వరకు రోడ్డు నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే ,మాజీ ఎమ్మెల్సీ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినట్లు అనే తెలిపారు. టెండర్లు పూర్తి చేసి త్వరలోపనులు ప్రారంభించడానికి కృషి చేయాలని ఆయన కోరారు.



టిడిపి నాయకుడు దృశ్యం →

## ఆట

# టాటా స్టీల్ చెస్: ప్రజ్ఞానందతో గుకేశ్ డ్రా



**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026, రౌండ్ 4లో భారత్ గ్రాండ్ మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానానంద మధ్య మ్యాచ్ డ్రా అయింది. అలాగే భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ కూడా నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై డ్రాతో సరిపెట్టుకున్నాడు. గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞాన్ నాల్గవ రౌండ్‌లో తన రెండో డ్రాను స్వదేశీయుడు దొమ్మరాజుతో గుకేష్ ఆడాడు. బ్లాక్ పావులు కలిగి ఉన్న గ్రాండ్ మాస్టర్ అర్జున్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై 80-మూవ్‌ల గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీనివల్ల అతను ఉమ్మడి ఆధిక్యం నుండి కిందికి దిగజారాడు. అర్జున్ ఇప్పుడు 4ఆటల నుండి 2.5 పాయింట్లతో ఇద్దరుఉమ్మడి గ్రాండ్ మాస్టర్లు నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్) మరియు హాన్స్ నీమాన్ (అమెరికా) కంటే అర పాయింట్ వెనుకబడి ఉన్నాడు. ఇదే సమయంలో డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానంద తన నాలుగు ఆటలలో కేవలం 1 పాయింట్‌తో అనిష్‌తో పాటు పట్టికలో దిగువన వెనుకబడి ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ అరవింద్ చితంబరం ఈ టోర్నమెంట్‌లో తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. హాన్స్ నీమాన్ చేతిలో ఓడిపోయాడు. దీంతో అతడు పాయింట్ల పట్టికలో 1.5 పాయింట్లతో సంయుక్తంగా 10వ స్థానానికి పడిపోయాడు. నేడు జరిగే 5వ రౌండ్‌లో అతను జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో తలపడనున్నాడు. అదే సమయంలో, గుకేష్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన థాయ్ డై వాన్ న్గయెన్‌తో, అర్జున్ స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్‌పై తలపడనున్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ విజయం



**న్యూఢిల్లీ:** పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లో భారత్ షట్లర్ యుకీ భాంబ్రీ, తన స్వీడిష్ భాగస్వామి ఆండ్రీ గోరాన్సన్‌తో కలిసి 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సునాయాస విజయంతో ప్రారంభించారు. మెల్‌బోర్న్ పార్క్‌లోని కోర్ట్ 13లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 10వ సీడ్ జంట జేమ్స్ డక్‌వర్త్ మరియు క్రజ్ హెవిట్‌ల స్వదేశీ జోడీపై 6-3, 6-4 తేడాతో వరుస సెట్‌లతో విజయం సాధించింది. యుకీ-గోరాన్సన్ జోడీ మొదటి సర్వ్‌లోనే 95 శాతం విజయ రేటును నమోదు చేశారు. 5 సర్వీస్ గేమ్‌లలో 4 గెలిచారు (40-0). మొదటి సెట్‌లో మూడు బ్రేక్ పాయింట్లను సాధించి, గేమ్9లో వాటిలో ఒకదాన్ని గోల్‌గా మార్చుకుని 6-3తో సెట్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ సెట్‌లో కూడా మొదటి నాలుగు సర్వ్ గేమ్‌లను లవ్‌పై గెలవగా (40-0) ఇందులో 4 ఏస్‌లు కూడా ఉన్నాయి. 7వ గేమ్‌లో ఇండోస్వీడిష్ ద్వయం జేమ్స్ డక్‌వర్త్ సర్వీస్‌పై సెట్‌లో తొలి బ్రేక్‌ను పొందారు. 10 పాయింట్ల డ్యూస్ గేమ్ ఆడినప్పటికీ మనుగడ సాగించలేకపోయాడు. ఆ తర్వాత, మ్యాచ్ చివరి గేమ్‌లో, గోరాన్సన్ ద్వయం తన సర్వీస్‌ను 40-15తో సులభంగా మలిచి సెట్‌ను గెలుచుకుని రెండవ రౌండ్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నారు.

### మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ముంబయి ఇండియన్స్ ఔట్

## ఫైనల్‌కు చేరడంపై సందిగ్ధం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026, సీజన్ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఐదు జట్లు దాదాపు ఐదేసి లీగ్ మ్యాచ్‌లు ఆడాయి. ఈ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పాయింట్స్ టేబుల్‌లో 10 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఈ జట్టు నెట్ రన్ రేటు +1.882గా ఉంది. ఇక ఆరు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి ముంబై ఇండియన్స్ మెరుగైన +0.046 రన్‌రేట్‌తో 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. యూపీ వారియర్స్ ఆడిన ఐదు మ్యాచ్‌లో రెండు గెలిచి-0.483 నెట్‌రన్ రేట్‌తో మూడో స్థానంలోను, ఢిల్లీ క్యాపిటల్స్ ఐదు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి -0.586 నెట్‌రన్ రేట్‌తో 4 పాయింట్లతో నాల్గో స్థానంలోను, గుజరాత్ జెయింట్స్ రెండు గెలుపొంది -0864 నెట్‌రన్ రేట్ కలిగి నాల్గు పాయింట్ల తో చిట్టచివరిన ఐదో స్థానంలో ఉంది. దాంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూపీఎల్ రూల్స్ ప్రకారం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో టాప్3లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచే జట్టు నేరుగా ఫైనల్ చేరనుండగా, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తోంది. ప్రస్తుతం ఆరు మ్యాచ్‌ల్లో రెండేసి విజయాలతో రెండో స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లకు రెండూ గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 8 పాయింట్స్ చేరుతాయి. దీంతో యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం అవుతుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి మాత్రమే గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరడం కష్టం. అద్భుతం జరిగితే తప్పా ఇది సాధ్యం కాదు. ఎందుకంటే ముంబై ఇండియన్స్ చివరి రెండు మ్యాచ్‌లకు మూడు గెలిచినా గరిష్టంగా 8 పాయింట్లు మాత్రమే సాధించగలదు. ఆర్‌సీబీ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ జట్టు తమ చివరి మూడు మ్యాచ్‌లకు మూడింటిని ఘోరంగా ఓడిపోవడంతో పాటు ముంబై ఇండియన్స్ మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. ఇతర జట్లు కూడా 10 పాయింట్స్ సాధించవద్దు. అప్పుడే ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరగలదు. ఇలా జరగడం అసాధ్యం. ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకొని ఎలిమినేటర్‌లో విజయం సాధిస్తేనే ముంబైకి ఫైనల్ బెర్త్ దక్కుతుంది.






# ప్రో రెజ్లింగ్ లీగ్‌లో ముంబయిపై పంజాబ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026లో 3-1 తేడాతో వెనుకబడి ఉన్న పంజాబ్ రాయల్స్ 6వ రోజు నాటకీయమైన మ్యాచ్‌లో అద్భుతమైన పునరాగమనం చేసి ముంబై దంగల్స్‌పై 6-3 తేడాతో విజయం సాధించింది. మహిళల 57 కిలోల పోటీలో కీలక మలుపు చోటు చేసుకుంది. అక్కడ రజనీత జాంగ్రా పతనంతో టైను సమం చేసింది. 74 కిలోల పోటీలో చంద్రమోహన్ గెలుపుతో పంజాబ్ ఊపందుకోగా, ఆ తర్వాత మీనాక్షి ఆధిపత్య విజయంతో మ్యాచ్‌ను ముగించింది. పంజాబ్ వరుసగా ఐదు బౌట్‌లను గెలిచిన నిర్ణయాత్మక ఆటను పూర్తి చేసింది. పంజాబ్ తరపున ఆడిన నలుగురు మహిళా రెజ్లర్లు విజేతలుగా నిలిచారు. 86 కిలోల పురుషుల బౌట్‌లో ముంబైలో టైగర్స్ ముకుల్ దహియా ద్వారా మొదటగా గోల్ చేశాడు. 62 కిలోల మహిళల పోటీలో పంజాబ్‌కు చెందిన కామన్వెల్త్ రజత పతక విజేత అనా గొడినెజ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 65 కిలోల పురుషుల విభాగంలో రోహిత్ రాహల్ వరుస టేక్‌డౌన్‌లతో ఆధిపత్యం చెలాయించినా తర్వాత బెలారస్‌కు చెందిన ఇస్లాం గుసేనోవ్‌పై ఓటమిచెందాడు. 57 కిలోల పురుషుల విభాగంలో కెప్టెన్ పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ చిరాగ్ చికారాను 17-7తో ఓడించి టైగర్స్‌ను 3-1తో ఆధిక్యంలో నిలిపాడు. 76 కిలోల మహిళల విభాగంలో ప్రియా మాలిక్ ప్రత్యర్థి జ్యోతి బెర్వాల్‌ను 10-0తో కమాండింగ్ షట్‌అవుట్ చేసి పంజాబ్‌ను పోటీలో దృఢంగా ఉంచింది. మహిళల 57 కిలోల విభాగంలో జాతీయ ఛాంపియన్ రజనితా జాంగ్రా ప్రారంభంలోనే టేక్‌డౌన్‌తో కొట్టింది, పీరియడ్ 2లో మరో టేక్‌డౌన్ మరియు టర్న్‌అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌తో స్కోరును 3-3గా చేసి నిర్ణయాత్మకంగా మార్చింది. 74 కిలోల పురుషుల విభాగంలో చంద్రమోహన్ ద్వారా పంజాబ్ తొలిసారిగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అతడు 15-9 తేడాతో విజయం సాధించి పంజాబ్‌ను 4-3తో ఆధిక్యంలో ఉంచాడు.


### ఇండోనేసియా మాస్టర్స్‌లో..

# మెయిన్ డ్రాకు అన్మోల్, ఆకర్షి

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా మాస్టర్స్-2026 తొలి రౌండ్‌లో స్టార్ ఇండియన్ షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ పోరాట విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో జపాన్‌కు చెందిన మనామి సుయిజుపై 22-20, 21-28 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించడానికి ముందు సింధు నాలుగు గేమ్ పాయింట్లను కాపాడుకుంది. అలాగే 72 నిమిషాల మారథాన్ ఆట తర్వాత శ్రీకాంత్ 21-15, 21-13, 24-22 తేడాతో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జపనీస్ షట్లర్ కోకి వటనాబేపై ను నిర్ణయాత్మక ఆటలో అధిగమించాడు. తర్వాత లక్ష్య సేన్, అన్మోల్ ఖర్బ్ కూడా తమ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించారు. వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. లక్ష్య 21-13, 16-21, 21-14 తేడాతో చైనీస్ తైపీకి చెందిన వాంగ్ త్జు వీని ఓడించగా, అన్మోల్ 21-16, 21-17 తేడాతో పాయ్ యు పోపై విజయం సాధించాడు. అలాగే కిరణ్ జార్జ్, ఆకర్షి కశ్యప్ తమ తమ విభాగాలలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. కిరణ్ మోహ్ జాకి ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో 17-21, 14-21 తేడాతో ఓడిపోగా, ఆకర్షి రెండు మ్యాచ్ పాయింట్లను కోల్పోయి జూలీ జాకోబ్సెన్ (డెన్మార్క్) చేతిలో 21-8, 20-22, 17-21 తేడాతో, హెచ్ఎస్ ప్రణయ్ కూడా మొదటి రౌండ్‌లో 19-21, 11-21 తేడాతో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత లీ జియ్ జియా (మలేషియా) చేతిలో ఓడిపోయారు. ధ్రువ్‌తనీషా వరుసగా మూడోసారి ఇస్తోరా సెనాయన్‌లో జరిగిన మరో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. భారత అగ్రశ్రేణి మిక్స్‌డ్ డబుల్స్ జంట ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టోల పేలవమైన ఫామ్ కొనసాగింది. తొలి రౌండ్‌లో ఈ జంట 21-23, 22-20, 21-6 తేడాతో దిగువ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ జంట జూలియన్ మాజో-లియా పలెర్మో చేతిలో ఓటమి ఎదుర్కొంది. దీంతో, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ప్రచారం ముగిసింది.



# మార్కెట్లకు తప్పని వరుస నష్టాలు



**ముంబయి, జనవరి 21:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా నష్టాల బాటలోనే పయనిస్తున్నాయి. బుధవారం బిఎస్ఇ ఒక మోస్తరునష్టాలు చవిచూసింది. సెన్సెక్స్ 270.84 పాయింట్లు, నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 81,794.65 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమైంది. ఒక దశలో 81,124.45 పాయింట్ల కనిష్టాన్ని చేరుకుంది. చివరకు 270.84 పాయింట్ల నష్టంతో 81,909.63 వద్ద ముగిసింది. నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి, 25,157.50 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల ధోరణులు, బౌగోళిక ఉద్రిక్తతలు, మార్కెట్ అనిశ్చితి వంటివి సెంటిమెంట్ ను దెబ్బతీయడంతో స్టాక్ మార్కెట్ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ట్రెంట్, బిఇఎల్ ఎక్కువగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఇండిగో, ఎటెర్నల్ వంటి సంస్థలు లాభాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి విలువ మరింత తగ్గింది. అత్యల్ప కనిష్ట స్థాయి 91.73కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 64.33 వద్ద కొనసాగింది. బంగారం ధర ఔన్సుకు 4,862 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు భారతీయ మార్కెట్లో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. బుధవారం హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.53లక్షల వరకు చేరింది. ఇది అంతకుముందు రోజుతో పోలిస్తే రూ.9,000 అదనం. అంటే ఒక్కరోజులోనే తొమ్మిది వేల రూపాయలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42 లక్షలు గా ఉంది. వెండి కిలో ధర రూ.3.30లక్షలకు పైగానే ట్రేడవుతోంది. బిఎస్ఇలో 1437 కంపెనీలు పెరిగితే 2831 కంపెనీలషేర్లు క్షీణించాయి. మరో 142 కంపెనీల షేర్లుమాత్రం స్థిరంగానే కొనసాగాయి. ఇక బిఎస్ఇ ఎఇడ్‌క్యాప్ కూడా 1.01శాతం, స్మాల్‌క్యాప్ సూచీ కూడా 0.80శాతం పతనం చెందాయి.

# ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం, వెండి



**ముంబయి, జనవరి 21:** దేశీయ మార్కెట్లో బంగారం ధర సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. బుధవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో పసిడి ఫ్యూచర్స్ ధర మునుపెన్నడూ లేనంత గరిష్ఠస్థాయికి చేరింది. అమెరికా యూరప్ మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతుందన్న భయాలు, డాలర్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా 4.25శాతం (సుమారు రూ. 4,100) పెరిగి 10 గ్రాములకు రూ.1,56,970 వద్ద సరికొత్త ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. ఎంసీఎక్స్ మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ ధర 2.71శాతం పెరిగి కిలోకు రూ. 3,32,451కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. కామెక్స్‌లో ఔన్స్ బంగారం ధర 4,849 డాలర్లకు చేరింది. ఫిబ్రవరి 1 నుంచి ఎనిమిది యూరోపియన్ దేశాలపై అమెరికా సుంకాలు విధించనుంది, జూన్‌లో ఈ సుంకాలను 25 శాతానికి పెంచవచ్చని వచ్చిన నివేదికలు ఈ ర్యాలీకి తోడయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలగా, ఇన్వెస్టర్లు బంగారం, వెండి వైపు మళ్లారని పృథ్విఫిన్‌మార్ట్ కమోడిటీ రీసెర్చ్ విశ్లేషకులు మనోజ్ కుమార్ జైన్ తెలిపారు.

దీనికి తోడు రూపాయి బలహీనపడటం కూడా దేశీయంగా ధరల పెరుగుదలకు మద్దతునిస్తోంది. సోలార్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ వంటి రంగాల నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ బలంగా ఉండటంతో దీర్ఘకాలంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న నెలల్లో ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.3.50 లక్షల స్థాయికి చేరవచ్చని భావిస్తున్నారు.


# ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

## డాలర్ వర్సెస్ రూపాయి 91.74




**ముంబయి, జనవరి 21:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్‌టైమ్ కనిష్టానికి చేరాయి. అంతర్జాతీయ కరెన్సీ మార్పిడికౌంటర్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 91.74 వద్ద ముగిసాయి. ఇప్పటివరకూ ఇదే అత్యంత కనిష్టస్థాయి అని తెలుస్తోంది. అమెరికా వాణిజ్య ఒప్పందంలో జాప్యం విదేశీ ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి ఎక్కువ పెట్టుబడులు విత్‌డ్రాచేయడం, అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య, రాజకీయ ఉద్రిక్తతలు కూడారూపాయి పతనానికి కారణంగా తెలుస్తోంది. డిసెంబరులో ఒకపర్యాయం రూపాయి 91 మార్కుకు చేరి ఆ తర్వాత రికవరీ అయింది. తిరిగి మళ్లీ బుధవారం రోజున ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. అత్యంత క్షీణత దశలో 91.08 వద్దప్రారంభం అయి రానురాను మరింత క్షీణించింది. కరెన్సీ వరుసగా ఆరోరోజు కూడా క్షీణించింది. ఎక్కువగా అమెరికా ట్రంప్ వైఖరి రూపాయి క్షీణతను మరింత పెంచుతోంది. 2024లో రూపాయి 4.95శాతం క్షీణించింది. టర్కి లీరా, అర్జెంటీనా పెసో కరెన్సీలు కూడా సుమారు 50శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.36వేల కోట్లకుపైగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. గత ఏడాది కూడా మార్కెట్లనుంచి సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి. వీటివల్లకూడా డాలర్ డిమాండ్‌పెరిగింది. దీనివల్ల దేశీయ కరెన్సీపై ఒత్తిడిపెరిగింది.

# జొమాటో మాతృసంస్థ సిఇఒ రాజీనామా



**ముంబయి, జనవరి 21:** ప్రముఖ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో మాతృ సంస్థ అయిన ఎటెర్నల్‌లో కీలకమార్పులు జరిగాయి. కంపెనీ మూడవ త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో పాటు, యాజమాన్య నిర్మాణంలో పెను మార్పులను చేపట్టింది. సంస్థ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ సిఇఒ పదవి నుంచి తప్పుకోవడం ఇప్పుడు కార్పొరేట్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎటెర్నల్ గ్రూప్ సిఇఒగా ఉన్న దీపిందర్ గోయల్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన కంపెనీ నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. భవిష్యత్తులో కంపెనీకి సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగస్వామిగాఉంటూ, బోర్డు డైరెక్టర్‌గా, వైస్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. కొత్త, అధిక రిస్క్ కలిగిన ప్రాజెక్టులపై దృష్టి పెట్టడానికే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. దీపిందర్ గోయల్ స్థానంలో బ్లింకిట్ సిఇఒ అల్బీందర్ సింగ్ దిండ్సా ఎటెర్నల్ గ్రూప్ కొత్త సిఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్లింకిట్‌ను క్విక్ కామర్స్ రంగంలో తిరుగులేని శక్తిగా మార్చడంలో అల్బీందర్ చూపిన ప్రతిభను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టారు. ఫిబ్రవరి 1, 2026 నుండి ఆయన ఈ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. యాజమాన్య మార్పుల వేళ కంపెనీ అద్భుతమైన ఆర్థిక ఫలితాలను సాధించింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.102 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 59 కోట్లతో పోలిస్తే ఇది 73 శాతం వృద్ధి సాధించింది. గత ఏడాది రూ.5,405 కోట్లుగా ఉన్న రాబడులు, ఏకంగా 202 శాతం వృద్ధి చెంది రూ. 16,315 కోట్లకు చేరుకుంది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్ బ్లింకిట్ కీలక పాత్ర పోషించింది. బ్లింకిట్ తన నిర్వహణలో బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పట్టడం కంపెనీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అల్బీందర్ సింగ్ దిండ్సా నాయకత్వంలో బ్లింకిట్ సాధించిన ఈ విజయమే ఆయనను గ్రూప్ సిఇఒ స్థాయికి చేర్చిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# టెక్ దిగ్గజం మెటాలో భారీ లేఆఫ్‌లు




**సియాటెల్, జనవరి 21:** టెక్ దిగ్గజం మెటాలో ఉద్యోగుల కోతలు కొనసాగుతున్నాయి. తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన మెటావర్స్, వర్చువల్ రియాలిటీ విభాగాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ భారీ లేఆఫ్స్‌కు శ్రీకారంచుట్టారు. దాదాపు 15,000 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు. ఇప్పటివరకు మెటావర్స్ కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను మెటా కుమ్మరించింది. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు తగినట్లుగా కొనసాగుతోంది. వీఆర్ హెడ్‌సెట్ల కంటే ఎఐ ఆధారిత స్మార్ట్ గ్లాసెస్, వేరబుల్ గ్యాడ్జెట్లపై పెట్టుబడి పెట్టడం మేలని భావించిన మెటా అందుకు అనుగుణంగానే ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ లేఆఫ్స్ నిర్ణయంపై ఒకులస్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 2017లో కొన్ని వివాదాల కారణంగా జుకర్‌బర్గ్ చేత తొలగించబడ్డ పామర్ ఇప్పుడు అదే జుకర్‌బర్గ్ నిర్ణయాన్ని సమర్థించారు. రెండేళ్లుగా మెటా వరుసగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది. తాజా లేఆఫ్స్‌తో రియాలిటీ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తొలగింపునకు గురైన వారికి మెటా తన ప్యాకేజీ నిబంధనల ప్రకారం పరిహారం అందజేయనుంది.

## వాణిజ్యం




### టిసిఎల్‌తో సోనీ టైఅప్..

# కొత్త జాయింట్ వెంచర్

**ముంబయి, జనవరి 21:** హోం ఎంటర్‌టైన్‌మెంట్‌లో దిగ్గజంగా ఉన్న సోనీ ఇతర కంపెనీలతో భాగస్వామి అవుతోంది. ఎలక్ట్రానిక్స్ కంపెనీలు సోనీ, టిసిఎల్ భాగస్వామ్యం దిశగా ముందడుగు వేశాయి. ఈ మేరకు రెండు కంపెనీలు ఎంఒయులపై సంతకాలు చేశాయి. సోనీ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని నిర్వహించేలా ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు అవుతుంది. ప్రతిపాదిత నిర్మాణంలో టిసిఎల్‌కు 51 శాతం వాటా, సోనీకి 49 శాతం వాటా ఉంటుంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని రెండు సంస్థలు స్పష్టం చేశాయి. ఈ చర్చలు తుది దశకు చేరితే కొత్త జాయింట్ వెంచర్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఉత్పత్తుల డిజైన్, డెవలప్మెంట్ నుంచి తయారీ, విక్రయాలు, లాజిస్టిక్స్, కస్టమర్ సర్వీస్ వరకు హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ మొత్తం చైన్‌ను జెవీ చూస్తుంది. టెలివిజన్లు, హోమ్ ఆడియో ఉత్పత్తులు ప్రధానంగా ఉంటాయి. రెండు కంపెనీలు 2026 మార్చి చివరికి బైండింగ్ ఒప్పందాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాయి. అవసరమైన అనుమతులు లభిస్తే 2027 ఏప్రిల్‌లో కొత్త సంస్థ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్‌పై అభిరుచులు పెరుగుతుండటం ఈ భాగస్వామ్యానికి కీలక కారణంగా మారింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, వీడియో షేరింగ్ యాప్స్, స్మార్ట్ టీవీ ఫీచర్లు, అధిక రిజల్యూషన్ డిస్‌ప్లేలు వినియోగదారుల అలవాట్లను మారుస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తూనే, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ పెంచడమే ఈ జాయింట్ వెంచర్ లక్ష్యం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.